# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
30-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 157

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# కాంగ్రెస్‌కు షాక్!

## తెలంగాణలో తగ్గుతున్న గ్రాఫ్

ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 8 ఎంపీ సీట్లు నుంచి నాలుగుకు పడిపోనున్న బలం


అనూహ్యంగా బిజెపి.. మరో స్థానంతో 9 సీట్లకు

గులాబీ పార్టీకి ఈసారి ఛాన్స్

మూడు ఎంపీ సీట్లు గెలుచుకునే అవకాశం

ఇండియా టుడే- సి ఓటర్ సర్వేలో సంచలనం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తప్పదా? వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ఆ పార్టీ పరిస్థితి తలకిందులుగా మారుతుందా? భారతీయ జనతా పార్టీ బలం పుంజుకొని అధికారాన్ని అందుకుంటుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. దేశవ్యాప్తంగా ఇండియా టుడే- సి ఓటర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో సంచలన ఫలితాలు వచ్చాయి. అధికార పీఠం వైపు భారతీయ జనతా పార్టీ అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా తెలియజేసింది ఈ సర్వే.




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

**దేశవ్యాప్త సర్వే..** దేశవ్యాప్తంగా మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో ఇండియా టుడే- సి ఓటర్ సంస్థ సర్వే చేపట్టింది. అయితే జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ స్వల్పంగా పుంజుకుంటుందన్న సంకేతం వచ్చింది. మరోవైపు బిజెపికి 26 సీట్లు తగ్గుతాయని ఈ సర్వే తేల్చింది. కానీ తెలంగాణలో అనూహ్యంగా కాంగ్రెస్ వెనుక పడడం ఆందోళన కలిగించే విషయం. ఇప్పటికీ ఇప్పుడు ఎన్నికల జరిగితే కాంగ్రెస్ బలం సగానికి పడిపోయి.. కేవలం నాలుగు పార్లమెంట్

- మిగతా 2వ పేజీలో



# ఎంఐఎం ఎమ్మెల్సీపై వేటు!

## రహమత్ బెగ్ బహిష్కరణ

- లైంగిక వీడియోలు బయటకు రావడంతో అసదుద్దీన్ ఓవైసీ కఠిన నిర్ణయం

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయంలో - మిగతా 2వ పేజీలో




# వైసీపీకి షాక్!

### ఏపీ మరోసారి కూటమిదే

తేల్చేసిన ఇండియా టుడే సి ఓటర్ సర్వే

ఈసారి వైయస్సార్ కాంగ్రెస్‌కు

కడప కూడా కష్టమే

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. మరోసారి టిడిపి కూటమి హవా చాటుతుందని ఓ సర్వే తేల్చింది. దేశవ్యాప్తంగా ఇండియా టుడే సి ఓటర్ సంస్థ సర్వే చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన ఫలితాలను కూడా వెల్లడించింది. అయితే కూటమి

- మిగతా 2వ పేజీలో



# దటీజ్ రేవంత్!

## మంత్రి సురేఖ పట్ల ఆప్యాయత

రాఖీ కట్టేందుకు వచ్చినప్పుడు పూర్వపు ఆదరణ..

ఇంతవరకు ఒక్క విమర్శ చేయని వైనం

రాజకీయాల్లో భావోద్వేగం ముఖ్యమని చాటిన రేవంత్ రెడ్డి

రాజకీయ నాయకుడికి సమయస్ఫూర్తి అవసరం. అన్నింటికీ మించి సహనం అవసరం. ఇప్పుడు అటువంటి వాటి విషయంలో తెలంగాణ సీఎం రేవంత్ ముందున్నారు. తన కుటుంబాన్ని టార్గెట్ చేసిన కొండా సురేఖ రాఖీ కట్టడానికి వస్తే రేవంత్ అత్యంత ఆప్యాయత చూపారు. ఈ విషయంలో ఆయన అభినందనలు అందుకుంటున్నారు. ఎందుకంటే రాజకీయాలు ఇప్పుడు మారిపోయాయి. రాజకీయ వైరమే వ్యక్తిగత శత్రుత్వం గా మారుతోంది. కానీ రేవంత్ మాత్రం ఆ లక్షణాలను ఒక్క శాతం కూడా వంట పట్టించుకోలేదు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** వ్యక్తిగత కక్షలకు తావులేని వ్యూహాత్మక రాజకీయ నైపుణ్యం రేవంత్ రెడ్డి సొంతం. రాజకీయాల్లో ప్రత్యర్థుల విమర్శలు, సొంత పార్టీ అంతర్గత విభేదాలు అనేవి సర్వసాధారణం. అయితే ఇందులో రేవంత్ ప్రత్యేక వైఖరి కనబరుస్తున్నారు. రాజకీయ శత్రువులతో పాటు పార్టీలోని అసమ్మతి నేతలను ఆయన ఎప్పుడూ వ్యక్తిగత శత్రువులుగా చూడడం లేదు. మనసులో ఏ అభిప్రాయం ఉన్నా దానిని బయట పెట్టకుండా పరిణితి చెందిన నాయకుడిగా వ్యవహరించడం ఆయనకు ప్రత్యేకమే. కెసిఆర్ లాంటి బలవంతమైన నాయకుడిని ఢీకొట్టారు రేవంత్.

- మిగతా 2వ పేజీలో

# వైసిపిపై విజయసాయిరెడ్డి బాంబ్!

సజ్జల రామకృష్ణారెడ్డి పై సంచలన విమర్శలు

పార్టీ నుంచి బలవంతంగా పంపించారని ఆవేదన

74 సార్లు జగన్ అవమానించారంటూ బాధ

రెండు పేజీల లేఖను విడుదల చేసిన వైసీపీ మాజీ నేత

2లో





# జనసేనలోకి తమ్మినేని!

వైసీపీలో కలిసిరాని పరిణామాలు

ఆ పార్టీకి గుడ్ బై చెప్పాలన్న యోచనలో సీనియర్ నేత

పవన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోతే పాలిటిక్స్ కు గుడ్ బై

### తెలంగాణ చెరువుల పునరుద్ధరణ

# అత్యావశ్యకం

చిన్ననీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలి

సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక



హైదరాబాద్,ఆగస్ట్29(ఆర్ఎన్ఎ): తెలంగాణలో చెరువుల పరిరక్షణ, చిన్న నీటిపారుదల వ్యవస్థ బలోపేతం దిశగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కీలక సూచనలు చేసింది. చిన్న నీటిపారుదల వ్యవస్థను ప్రత్యేకంగా పునరుద్ధరించడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని

మిగతా 3లో

## 31 వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం

నిర్వాసితుల కోసం రూ.4.07 కోట్ల నిధుల విడుదల

ఉత్తర్వులు జారీ చేసిన ఎపి ప్రభుత్వం

**అమరావతి, క్రైమ్ మిర్రర్:** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఈ నెల 31న జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను

మిగతా 2లో

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

బ్యాండ్ అంబాసిడర్‌గా కపిల్ దేవ్

మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

**హైదరాబాద్, క్రైమ్ మిర్రర్:** పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించు

మిగతా 3లో




మిగతా 2లో

## 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

సర్క్యులర్ విడుదల చేసిన కార్యదర్శి



**హైదరాబాద్, క్రైమ్ మిర్రర్:** తెలంగాణ శాసనసభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ చేశారు.

# జనసేనలోకి తమ్మినేని!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం ఆ పార్టీకి గుడ్ బై చెబుతారా? జనసేనలో చేరుతారా? లేకుంటే రాజకీయాలకు దూరం అవుతారా? ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో దీని పైనే ప్రచారం నడుస్తోంది. గత కొంతకాలంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు తమ్మినేని. తాడేపల్లి లో ఇటీవల జరిగిన పార్టీ ముఖ్యుల సమావేశానికి సైతం గైర్హాజరయ్యారు. దీంతో తమ్మినేని తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగడమా? లేకుంటే రాజకీయాలకు దూరం కావడమా? అన్న డైలమాలో ఆయన కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

**వైసీపీ నుంచి మూడుసార్లు పోటీ..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో పనిచేస్తున్నారు తమ్మినేని. 2014లో తొలిసారిగా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో గెలిచేసరికి మంత్రి పదవి ఆశించారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆయనకు శాసనసభ స్పీకర్ పదవి ఇచ్చారు. 2024 ఎన్నికల్లో కూడా ఆయనకు అవకాశం కల్పిస్తే ఓడిపోయారు. అయితే అక్కడ టిడిపి అభ్యర్థిగా ఉన్న కూన రవికుమార్ సమీప బంధువు. వీరి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉందనేది వైసిపి నేతలు చేసే ఆరోపణ. ఈ క్రమంలో తమ్మినేని నియోజకవర్గ ఇన్చార్జి పదవి నుంచి తప్పించి.. ఆమదాలవలస బాధ్యతలను చింతాడ రవికుమార్ అనే యువనేతకు అప్పగించారు జగన్. రోజురోజుకు చింతాడ రవికుమార్ ప్రాబల్యం పెరుగుతుండడం.. జగన్మోహన్ రెడ్డి తనను పట్టించుకోకపోవడంతో తమ్మినేని సైలెంట్ మోడ్ లోకి వెళ్లి పోయినట్లు తెలుస్తోంది. తన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం ఆయన జనసేనలో చేరుతారని గతం నుంచి ప్రచారం నడుస్తోంది. ఇప్పుడు కూడా జనసేనలోకి వెళ్తారన్న ప్రచారం భారీ స్థాయిలో జరుగుతోంది.

**టిడిపిలో తిరుగులేని నేత**

తెలుగుదేశం పార్టీలో తిరుగులేని నేతగా ఎదిగారు తమ్మినేని సీతారాం. ఆ పార్టీ అభ్యర్థిగా 1999 వరకు ఆమదాలవలస ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. టిడిపి గెలిచిన ప్రతిసారి తమ్మినేనికి మంత్రి పదవి దక్కేది. అటువంటి టిడిపిని కాదని 2009లో ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లారు. అక్కడ ఓడిపోయేసరికి తిరిగి టిడిపిలోకి వచ్చారు. కొద్ది రోజులకే మళ్ళీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పుడు ఆ పార్టీ నుంచి జనసేనలో చేరుతారని ప్రచారం నడుస్తోంది. ఒకవేళ జనసేన నుంచి సానుకూలత రాకపోతే రాజకీయాలకు గుడ్ బై చెబుతారన్న టాక్ ఉంది. చూడాలి చివరకు ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో..

# ఎంఐఎం ఎమ్మెల్సీపై వేటు!

అనుకోని ఘటన జరిగింది. శాసనమండలి సభ్యుడు మీర్జా రహీమత్ బేగ్ ను ఎంఐఎం పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తక్షణమే బహిష్కరిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. తక్షణం తన ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేస్తూ శాసనమండలి చైర్మన్ కు లేఖ సమర్పించాలని కూడా ఆదేశించింది.

**వివాదాస్పద వీడియోతో..**

అయితే ఈ హఠాత్ పరిణామం వెనుక ఒక వివాదాస్పద వీడియో లీక్ ఉదంతం ఉంది. రహీమత్ బేగ్ కు సంబంధించి కొన్ని మార్ఫింగ్ ఫోటోలు, డీప్ ఫేక్ వీడియోలు వైరల్ చేస్తామని.. డబ్బులు ఇవ్వాలని కొందరు అపరిచిత వ్యక్తులు బెదిరిస్తున్నారంటూ ఆయన ఇటీవల సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అవన్నీ మార్ఫింగ్ కాదని.. డీప్ ఫేక్ కాదని ఆ పార్టీ నాయకత్వం గుర్తించింది. ఈ వీడియో వ్యవహారం సోషల్ మీడియాలో కలకలం రేపడం, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వివాదం ముదరడంతో.. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**తక్షణ వేటు..**

ఇటీవల ఓ మైనర్ బాలికతో ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే అందులో ఉన్నది తాను కాదు అని రహమత్ చెప్పుకొచ్చారు. అయితే ఈ వీడియోతో పార్టీకి డ్యామేజ్ జరిగింది. అందుకే హాయ్ కమాండ్ సీరియస్ యాక్షన్ కు దిగింది. పార్టీలో క్రమశిక్షణతో పాటు ఇమేజ్ కు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారు. అయితే ఈ వివాదం వల్ల పాత బస్తీలోనూ, పొలిటికల్ వర్గాల్లోనూ అనవసర ప్రచారం జరుగుతుండడంతో వెనుకడుగు వేయకుండా పార్టీ నాయకత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఆరోపణలతో పాటు వీడియోల వివాదం ఎంతవరకు నిజమనే అంశంతో సంబంధం లేకుండా.. వివాదం పార్టీ దాకా రాకుండా చూసుకునే క్రమంలోనే తక్షణ బహిష్కరణ వేటు వేసినట్లు ఎంఐఎం వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పార్టీలో ఎంతటి నాయకుడైనా క్రమశిక్షణ తప్పితే రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టమైన సంకేతాలు పంపారు అసదుద్దీన్ ఓవైసీ. మరోవైపు రహమత్ తన మండలి సభ్యత్వానికి రాజీనామా చేయకుండా ధిక్కరించే అవకాశం లేదు. ఎందుకంటే పాత బస్తీలు ఓవైసీ మాటను కాదని ఎవరూ రాజకీయం చేయలేరు కూడా.

# గంజాయి చాక్లెట్ విక్రేత అరెస్ట్

హైదరాబాద్: షామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కలిపిన చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్‌కు చెందిన బైద్‌నాథ్ (29) తూముకుంటలోని తన పాన్‌షాప్ నుంచి ఈ చా÷-లకెట్లను విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు పాన్‌షాప్‌పై దాడి చేసి పెద్ద ఎత్తున గంజాయి కలిపిన చా÷-లకెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 5,298 ప్యాకెట్లు పట్టుబడగా, వాటి బరువు సుమారు 25 కిలోలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనలో బైద్‌నాథ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అతని భార్య పూజా కుమారి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆమె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఈ చా÷-లకెట్లు ఎక్కడి నుంచి తెప్పించారు? ఎవరెవరికి విక్రయించారు? వీటి వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దటీజ్ రేవంత్!

(మొదటి పేజీ తరువాయి)

తాను అనుకున్న ముఖ్యమంత్రి పదవిని అధిరోహించారు. అదే కెసిఆర్ ఆసుపత్రిలో ఉంటే స్వయంగా పరామర్శించి పెద్దరికాన్ని ప్రదర్శించారు. అప్పుడే ఆయనలో భావజాల, వ్యూహాత్మక పోరాటాలు బయటపడ్డాయి. వైరి వర్గాన్ని రేవంత్ వ్యక్తిగత శత్రువులుగా చూడరని అర్థమైంది. ఇటీవల కొండా సురేఖ కుమార్తె తన కుటుంబాన్ని టార్గెట్ చేసినప్పటికీ రేవంత్ బహిరంగంగా ఒక్క వ్యక్తి కూడా చేయలేదు. ఈ వ్యవహారాన్ని సంస్థాగత కోణంలోనే చూశారు కానీ.. వ్యక్తిగత కక్ష సాధింపుగా మార్చలేదు. ఇది ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయనకు ప్రత్యేకమే.

**పక్కా రాజకీయ ధోరణితోనే**

రేవంత్ రెడ్డి దూకుడు కలిగిన నాయకుడు. ఆ విషయంలో మరో మాటకు తావులేదు. రేవంత్ రాజకీయం సానుభూతి నినాదాలు చుట్టూ తిరగదు. పక్కా రాజకీయ ధోరణిలోనే సాగుతుంది. రాజకీయాలను ఎలా నడపాలో.. విమర్శలను ఏ విధంగా తిప్పికొట్టాలో ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. ఆధిపత్యం చాటుకునేందుకు ఆయన ప్రయత్నం చేయరు. తన స్థానాన్ని, అధికారాన్ని వ్యూహాత్మక చర్యల ద్వారా నిలబెట్టుకోవడం ఆయన శైలి. రాజకీయాల్లో కంట్రోల్ తప్పి మాట్లాడడం అనేది ఒక కామన్ పాయింట్ గా మారింది. కానీ రేవంత్ మాత్రం తన భావోద్వేగాలను అదుపు చేసుకోగలరు. నిన్ననే సురేఖ రాఖీ కట్టినప్పుడు సీఎం రేవంత్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఆమె పట్ల అనుసరించిన తీరు అభినందనలను అందుకుంటుంది.

# కాంగ్రెస్‌కు షాక్!

సీట్లకే పరిమితం అవుతుందని ఈ సర్వే తేల్చింది. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష కూటమి పుంజుకుంటుందన్న సంకేతాల నేపథ్యంలో.. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ గ్రాఫ్ వేగంగా పడిపోతుండడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యారెంటీల అమలు విషయంలో ఎదురవుతున్న సవాళ్లు, క్షేత్రస్థాయిలో పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత ఈ సగానికి సగం సీట్లు కోల్పోవడానికి ప్రధాన కారణాలుగా విశ్లేషిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల జోరును కొనసాగించడంలో అధికార యంత్రాంగం, పార్టీ నాయకత్వం విఫలమవుతుందనే సంకేతాలు ఈ సర్వే ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది. కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం ఎనిమిది పార్లమెంటు స్థానాలు ఉండగా.. 8 సీట్లకు పడిపోతుంది అనేది ఆ సర్వే సారాంశం.

**పట్టు బిగిస్తున్న బిజెపి..**

మరోవైపు భారతీయ జనతా పార్టీ తెలంగాణలో తన పట్టును మరింత బిగిస్తోందని ఈ సర్వేలు చెబుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో గెలుచుకున్న ఎనిమిది స్థానాల నుంచి మరో స్థానాన్ని అదనంగా సొంతం చేసుకుని.. 9 సీట్లకు చేరుకుంటుందని సి ఓటర్ చెబుతోంది. అదే జరిగితే



తెలంగాణలో బలమైన పార్టీగా బిజెపి అవతరించనుండడం ఖాయం. మరోవైపు భారత రాష్ట్ర సమితికి సైతం ఈ సర్వే ఫలితాలు కలిసి వచ్చాయి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవని ఆ పార్టీ ఇప్పుడే గాని ఎన్నికలు జరిగితే మూడు సీట్లను గెలుచుకునే అవకాశం ఉందని ఈ సర్వే అంచనా వేసింది. మరోవైపు ఎంఐఎం పాతబస్తీలో తన హవాను చాటనుంది. కాంగ్రెస్ మాత్రం చావు దెబ్బ తిన్నట్లు కనిపిస్తోంది. మరి ఈ సర్వే ఫలితాలను గుణపాఠాలుగా మార్చుకొని కాంగ్రెస్ అడుగులు వేస్తే మంచిది.

# వైసీపీకి షాక్!

అనూహ్యంగా తన పట్టును నిలుపుకుంది. అందులో తెలుగుదేశం పార్టీకి అదనంగా బలం చేకూరగా.. బిజెపికి ఇప్పుడున్న రెండు పార్లమెంటు స్థానాలు తగ్గుతాయని ఈ సర్వే తేల్చింది. అయితే వైసిపి గతం కంటే ఒక్క స్థానాన్ని మాత్రమే మెరుగుపరుచుకుంది. ఆ పార్టీకి ఈసారి ఐదు పార్లమెంటు సీట్లు వస్తాయని తేల్చింది ఈ సర్వే.

**టిడిపికి రెండు సీట్లు అదనం..**

ప్రస్తుతం ఏపీలో తెలుగుదేశం పార్టీకి 16 ఎంపీ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో ఆ పార్టీ పొత్తులో భాగంగా 17 చోట్ల పోటీ చేసింది. 16 చోట్ల గెలిచింది. కానీ ఈ సర్వేలో మరో రెండు పార్లమెంట్ సీట్లను గెలుచుకోనుందని తెలుస్తోంది. అయితే కడప పార్లమెంటు సీటు సైతం ఈసారి టిడిపి ఖాతాలో పడడం ఖాయమని ఈ సర్వే తేల్చింది. భాగస్వామ్య పార్టీగా ఉన్న బిజెపికి రెండు సీట్లు తగ్గుతుండగా.. తెలుగుదేశం పార్టీకి రెండు సీట్లు పెరుగుతుండడం కలిసి వచ్చే అంశం. జనసేన మాత్రం తన రెండు పార్లమెంటు సీట్లను నిలబెట్టుకోనుందని ఈ సర్వే తేల్చింది.

**వైసీపీలో ఆందోళన..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పెరగలేదని తెలుస్తుండడం ఆ పార్టీ శ్రేణుల్లో నిరాశ కలిగిస్తోంది. పైగా కడప పార్లమెంటు సీటును సైతం ఆ పార్టీ పోగొట్టుకోవడం ఖాయమన్న టాక్ వస్తోంది. అయితే మొత్తానికి అయితే సి ఓటర్ వైసీపీకి నిరాశ మిగిల్చింది. ఇటీవల ఆ పార్టీ పుంజుకుంటుందన్న అభిప్రాయం శ్రేణుల్లో ఉంది. మొన్న మధ్యన ఊరు పేరు తెలియని సర్వే ఒకటి హల్చల్ చేసింది. అందులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు అంటూ ప్రకటన వచ్చింది. కానీ ఇప్పుడు ఇండియా టుడే తో కలిసి సి ఓటర్ జరిపిన ఈ సర్వే దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. రాష్ట్రంలో టిడిపి కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని తెలిసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రం దారుణంగా దెబ్బేసింది.

# 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటల నుంచి సభలు ప్రారంభమవుతాయని పేర్కొంటూ అసెంబ్లీ అధికారులు శాసనసభ సభ్యులతో పాటు శాసన మండలి సభ్యులకు కూడా సమాచారాన్ని అందిస్తూ సర్కులర్‌ను పంపించారు. తెలంగాణలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్‌లోనే నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గత బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అంతేకాకుండా మాజీ సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి ఈ చర్చలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలను లోతుగా చర్చించే అవకాశం ఉంది.

# 31 వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

వారి పునరావాస కాలనీలకు స్వచ్ఛందంగా తరలించేందుకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.4.07 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా పశువుల దాణా, నిత్యావసర సరుకులు, మహిళలకు ప్రత్యేక కిట్లను అందించనుంది. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని 10 గ్రామాలకు చెందిన నిర్వాసిత కుటుంబాల వద్ద ఉన్న పశువులకు 30 రోజుల పాటు దాణా అందించనున్నారు. మొత్తం 4,933 పశువులకు దాణా అందించేందుకు రూ.65.8 లక్షలు కేటాయించారు. ఇందుకోసం మొత్తం 295.98 మెట్రిక్ టన్నుల దాణా అవసరమని అధికారులు అంచనా వేశారు. నిర్వాసిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించేందుకు ప్రభుత్వం రూ.2.81 కోట్లు కేటాయించింది. మొత్తం 10,000 మందికి నిత్యావసర సరుకుల కిట్లను అందించనున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.2,818గా నిర్ణయించారు. ఈ కిట్‌లో 25 కిలోల బియ్యం, కిలో పప్పు, కిలో చక్కెర, లీటర్ వంటనూనె, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళాదుంపలు ఉంటాయి. నిర్వాసితులు కొత్త ఇళ్లలోకి ప్రవేశించే సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా కిట్లను అందించనున్నారు. మొత్తం 6,000 కిట్లు పంపిణీ చేయనున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.1,000గా ఉంటుంది. ఇందులో చీర, గాజులు, పసుపు, కుంకుమ ఉంటాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.60 లక్షలు కేటాయించింది. పశువుల దాణా, నిత్యావసర సరుకుల కిట్లు, మహిళలకు ప్రత్యేక కిట్ల కోసం కలిపి ప్రభుత్వం మొత్తం రూ.4.068 కోట్లు మంజూరు చేసింది.

# వైసిపిపై విజయసాయిరెడ్డి బాంబ్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విశ్వరూపం ప్రదర్శించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన తర్వాత తన రాజకీయం తాను చేసుకుంటున్న ఆయన కొత్త పార్టీ పెడుతున్న వేళ తన మనసులో ఉన్న బాధనంతా వెళ్ళగక్కారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తన విషయంలో జరిగిన పరిణామాలన్నింటినీ పూసకు గుచ్చినట్లు బయటపెట్టారు. అడుగడుగునా తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తనను ఎలా వాడుకుని వదిలేసారో వివరించే ప్రయత్నం చేశారు. ఇటీవల పార్టీ ఏర్పాటు చేస్తున్న క్రమంలో నమ్మకద్రోహం చేశారంటూ కొంతమంది ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు విజయసాయిరెడ్డి. అందులో సంచలన అంశాలను బయటపెట్టారు.

**సజ్జ లే టార్గెట్..**

ప్రధానంగా సజ్జల రామకృష్ణారెడ్డిని టార్గెట్ చేసుకున్నారు విజయసాయిరెడ్డి. ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తూ రెండు పేజీల సంచలన బహిరంగ లేఖను విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా తనపై నమ్మకద్రోహి అంటూ వైసీపీ కోటరీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. తాను నమ్మకద్రోహిని అయితే నాడు సజ్జల రామకృష్ణారెడ్డి మాదిరిగా కాంగ్రెస్తో ఒప్పందం చేసుకుని సిఐడి, ఈడి చార్జ్ సీట్లలో పేరు లేకుండా చేసుకునే వాడినని.. జగన్మోహన్ రెడ్డికి అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నందునే ఏ2 గా చేరి 15 నెలల పాటు జైలు జీవితం గడపాలని గుర్తు చేశారు. టిడిపి పాలనలో తనపై మద్యం స్కాం, పోర్టు కేసుల్లో



కేసులు పెట్టారని... కానీ జగన్మోహన్ రెడ్డికి వెన్నుపోటు పొడుస్తూ టిడిపి తో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్న సజ్జల పేరు మాత్రం ఏ కేసుల్లోనూ లేకపోవడం ఆయన కుట్ర రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

**రాజ్యాంగేతర శక్తిగా..**

2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి హవా పెరిగిందని విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు. ఒక రాజ్యాంగేతర శక్తిగా మారిపోయారని ఆరోపించారు. బొత్స తో కలిసి తనపై కుట్రలు చేసి బయటకు వెళ్లి పోయాలా చేశారని మండిపడ్డారు. మంత్రులతో పాటు ఎంపీలకు సైతం జగన్మోహన్ రెడ్డి అపాయింట్మెంట్ దక్కకుండా సజ్జల గోడ కట్టారని ఆరోపించారు. పార్టీలో తనలాంటి సీనియర్లను రీజనల్ కోఆర్డినేటర్లుగా నియమించి.. ప్రధాన సమన్వయకర్తగా సజ్జల వద్ద పనిచేయాలని ఆదేశించారని.. మనసు అంగీకరించక బయటకు వచ్చేసానని బాంబు పేల్చారు విజయసాయిరెడ్డి. బొత్స పేరు పెట్టకుండా ఉత్తరాంధ్రకు చెందిన ఓ మాజీ మంత్రితో ఈ తతంగం చేయించారని ఆరోపణ చేశారు.

**సజ్జల భౌతిక దాడి..**

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 74 అవమానాలను పడ్డానని ఈ లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు విజయసాయిరెడ్డి. 2022 మంగళగిరి ప్లీనరీ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి నేరుగా తనపై భౌతిక దాడికి పాల్పడితే జగన్ ప్రేక్షక పాత్ర పోషించారన్న సంచలన విషయాన్ని బయటపెట్టారు. తరువాత ఎమ్మెల్యేలతో పాటు ఎంపీల సమావేశంలో సాయి రెడ్డికి వయస్సు అయిపోయింది.. ముసలోడు అయిపోయాడు అంటూ అనుబంధ సంఘాలు, ఇతర పార్టీ పదవుల నుంచి జగన్ తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ దృష్టిలో తన మాటకు ఉన్న విలువే ఈ కోటరీ కడుపు మంటకు కారణమైందని.. పార్టీలో ఉంటూ కొవ్వొత్తులుగా పనిచేస్తున్నది ఎవరు? నమ్మకద్రోహులుగా పనిచేస్తున్నది ఎవరు? అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు జగన్ అభిమానులు గుర్తించాలన్నారు. మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి పై విరుచుకుపడిన తీరు చూస్తుంటే విజయసాయిరెడ్డి పార్టీలో ఎన్నెన్నో అవమానాలు పడ్డారని అర్థం అవుతోంది. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి కాదని.. ఆ పార్టీలో నెంబర్ వన్ అనేది సజ్జల రామకృష్ణారెడ్డి అంటూ తేల్చేశారు. ప్రస్తుతం ఆ పార్టీ సజ్జల చేతిలో ఉందని చెప్పుకొచ్చారు. 2029 లో జగన్ ఓడిపోతే వైసీపీ సీనియర్లకు భవిష్యత్తు కూడా ఉండదని తేల్చి చెప్పారు. అందుకే పార్టీలో జరుగుతున్న పరిణామాలను ఒక్కసారి గుర్తించుకోవాలని ఆ పార్టీ శ్రేణులకే విజయసాయిరెడ్డి సూచించడం విశేషం.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

కుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక, క్రీడా రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా క్రీడలు, పర్యాటక రంగాలు రెండింటినీ మిళితం చేస్తూ తెలంగాణను 'గోల్ఫ్ టూరిజం హబ్'గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ శివారు ప్రాంతమైన షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో దాదాపు 130 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ గోల్ఫ్ కోర్సును నిర్మించనున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే క్రీడాకారులను, పర్యాటకులను ఆకట్టుకునేలా దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన చేయనున్నారు. దీంతోపాటు, ప్రకృతి అందాలకు నిలయమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్ద మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ రెండింటిని నిర్మించి, పర్యాటకులకు ఉన్నత స్థాయి వసతులను కల్పించనున్నారు. భారీ ప్రాజెక్టులతో పాటు తెలంగాణ పర్యాటక , క్రీడారంగాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రముఖ భారతీయ క్రికెట్ దిగ్గజం, గోల్ఫ్ క్రీడాభిమాని కపిల్ దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనకున్న ప్రపంచవ్యాప్త గుర్తింపు ద్వారా విదేశీ పర్యాటకులను, పెట్టుబడిదారులను తెలంగాణ వైపు ఆకర్షించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం. ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి కేవలం పర్యాటక ఆదాయం మాత్రమే కాకుండా, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విదేశీ పర్యాటకుల రాకతో హోటల్, రవాణా రంగాలకు కూడా మహర్దశ పడుతుంది. ప్రకృతి సౌందర్యం, ఆధునిక క్రీడా వసతుల మేళవింపుతో తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.



## తెలంగాణ చెరువుల పునరుద్ధరణ
# అత్యావశ్యకం

(మొదటి పేజీ తరువాయి)

పెంచే సాంకేతిక విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను సమన్వయం చేస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థను తీసుకురావాలని సిఫారసు చేసింది. చిన్న నీటిపారుదలపై రూపొందించిన నివేదికను కమిషన్ ప్రతినిధి బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించింది. ఈ సందర్భంగా రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ రంగ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని సూచించింది. చెరువుల పూర్తి నీటి నిల్వ మట్టం సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి శాశ్వతంగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నీటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, చిన్న చెరువులు, ఇతర చిన్న నీటి వనరులను పెద్ద నీటిపారుదల వ్యవస్థలతో అనుసంధానించే విధానాన్ని రూపొందించాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ బృందం ముఖ్యమంత్రికి వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో వ్యవసాయ రంగంలో పంటల మార్పిడిపై మరింత దృష్టి పెట్టాలని, ఉద్యానవన పంటల సాగును పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపైనా కమిషన్ ప్రత్యేకంగా పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. చెరువుల పునరుద్ధరణతో పాటు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే అంశాలపై కూడా కమిషన్ మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు.

## కౌశిక్ రెడ్డి వ్యవహారంపై ఎథిక్స్ కమిటీ పరిశీలన

### వచ్చే సమావేశానికి కడియంను కూడా పిలవాలని నిర్ణయం

హైదరాబాద్: శాసనసభ ఎథిక్స్ కమిటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంశంపై చర్చ జరిగింది. చైర్మన్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఎథిక్స్ కమిటీ శనివారం సమావేశమైంది. ఈ భేటీలో పలు పార్టీలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డిపై చేసిన అభియోగాలు తొలగించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కడియం శ్రీహరిని ఉద్దేశించి చేయి చూపించి బెదిరించారని, అసభ్య పదజాలంతో దూషించారని కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు రెండు అభియోగాలు మోపారు. వీడియోలో సైగలు తప్ప వాయిస్ లేదని, ఇతర సభ్యుల వ్యాఖ్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. వివరణ చెప్పుకోవడానికి కౌశిక్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ సభ్యులు కోరారు. మరోవైపు.. సభా హుందాతనాన్ని గౌరవించాలని కాంగ్రెస్ సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌశిక్‌రెడ్డిపై అభియోగాలు వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్, భాజపా సభ్యులు ప్రతిపాదించారు. ఎథిక్స్ కమిటీలో కూడా భాజపా, బీఆర్ఎస్ కలిసే పనిచేస్తున్నాయని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. వచ్చే సమావేశానికి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరిని పిలవాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది.

# డ్రా మొదలైపోయింది.. ఎమ్మెల్యే రాకముందే ఎంపిక!

## ఖైరతాబాద్‌లో ప్రోటోకాల్ రగడ

### అధికారుల తీరుపై ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

### నిరసనగా లక్కీ డ్రా కార్యక్రమం నుంచి వెనుదిరిగిన ఎమ్మెల్యే



**హైదరాబాద్:** ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమం ప్రోటోకాల్ వివాదానికి దారితీసింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ హాజరుకాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంపై అధికారులను నిలదీసిన ఆయన.. నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన చేరుకునేలోపే అధికారులు డ్రా ప్రక్రియను ప్రారంభించారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధి హాజరు కావాల్సిన కార్యక్రమంలో ఆయన కోసం వేచి చూడకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ప్రోటోకాల్‌ను పాటించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని దానం నాగేందర్ హెచ్చరించారు. అధికారుల తీరును నిరసిస్తూ లక్కీ డ్రా కార్యక్రమంలో ఎక్కువసేపు ఉండకుండా అక్కడి నుంచి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు లక్కీ డ్రాలను చేపడుతోంది. ఇందులో భాగంగానే ఖైరతాబాద్ నియోజకవర్గంలోనూ లబ్ధిదారుల ఎంపికకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఎమ్మెల్యే రాకముందే డ్రా ప్రారంభం కావడంతో కార్యక్రమం రాజకీయ, అధికారిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రహ్మత్ బేగ్ బహిష్కరణపై అసలు కారణమేంటి?

## అసదుద్దీన్‌కు రాజాసింగ్ సూటి ప్రశ్న

### అర్ధరాత్రి వేళ బహిష్కరణ ఎందుకు..? కారణాలు బహిర్గతం చేయాలని డిమాండ్

### సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని ప్రశ్న

### డీప్‌ఫేక్ బ్లాక్‌మెయిల్ కేసుతో తాజా పరిణామాలకు సంబంధముందా?

**హైదరాబాద్:** ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఏఐఎంఐఎం నుంచి బహిష్కరించిన వ్యవహారంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక ప్రశ్నలు సంధించారు. పార్టీ నుంచి ఆయనను తొలగించడానికి దారితీసిన అసలు కారణాలను మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అర్ధరాత్రి వేళ అత్యవసరంగా బహిష్కరణ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో వివరించాలని ప్రశ్నించారు. శుక్రవారం అర్ధరాత్రి మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఏఐఎంఐఎం ప్రకటించింది. అంతేకాకుండా వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనా మా చేయాలని ఆదేశించింది. అయితే ఆయనను బహిష్కరించడానికి సంబంధించిన నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. దీంతో ఈ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో రాజాసింగ్ స్పందిస్తూ.. రహ్మత్ బేగ్‌పై చర్యకు కారణాలే మిటో మజ్లిస్ నాయకత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యవహారం పాతబస్తీ ప్రజల్లోనూ పలు సందేహాలకు తావిచ్చిందని పేర్కొన్నారు. అసదుద్దీన్ ఓవైసీ జాతీయ మీడియా ముందుకు వచ్చి మొత్తం వ్యవహారంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, రహ్మత్ బేగ్‌కు సంబంధించి భూవివాదాలు, లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నాయని రాజాసింగ్ ప్రస్తావించారు. అయితే ఈ ఆరోపణలకు



సంబంధించి ఎలాంటి అధికారిక నిర్ధారణ వెలువడలేదని పేర్కొంటూ, వాటిపై మజ్లిస్ నాయకత్వమే స్పష్టత ఇవ్వాలని కోరారు. గతంలో తనపై డీప్‌ఫేక్ వీడియోలను ఉపయోగించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తూ రహ్మత్ బేగ్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన విషయాన్ని కూడా రాజాసింగ్ ప్రస్తావించారు. ప్రస్తుతం ఆయనపై పార్టీ తీసుకున్న చర్యలకు ఆ ఘటనకు ఏమైనా సంబంధం ఉందా? అనే అంశాన్ని కూడా స్పష్టం చేయాలని కోరారు. మొత్తంగా రహ్మత్ బేగ్ బహిష్కరణ వెనుక ఉన్న కారణాలను బహిరంగంగా వెల్లడించాలని, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆరోపణలపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని రాజాసింగ్ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీని డిమాండ్ చేశారు.

# నేనే నమ్మకద్రోహినే అయితే జైలుకే ఎలా ఉంటా

### వైసిపి దుష్ప్రచారాలపై విజయసాయి మండిపాటు

అమరావతి: తాను ఏనాడూ నమ్మకద్రోహం పనులు చేయలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. తనపై నమ్మకద్రోహి అంటూ వైకాపా కోటరీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ఈమేరకు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. 'నేను నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకునేవాడిని. సీబీఐ, ఈడీ ఛార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. నమ్మకస్తుణ్ని అనే కారణంతో ప్రతి ఛార్జిషీట్‌లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నా పేరు చేర్చింది. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే నన్ను 15 నెలలు కారాగారంలో ఉంచారు. నాకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లోనూ ఏ-5గా చేర్చారు. కాకినాడ సీపోర్టు కేసులో ఏ2గా చేర్చారు. సకల శాఖల మంత్రి పేరు మాత్రం ఇంతవరకు ఏ ఛార్జిషీట్‌లోనూ లేదు. ఏ కేసులూ లేకుండా ఎలానో కోటరీ నాయకుడికి తెలిసినంత నాకు తెలియదు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఉత్తరాంధ్ర నేతతో కలిసి కోటరీ నాయకుడు కుట్ర పన్నారు. నాపై అసత్యాలు చెప్పి ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించారు. జగన్ మెప్పు కోసమే నాస్తికుడిగా చెప్పుకొన్న ఆయన వైకాపాకే కాదు.. రాష్ట్రానికే నమ్మకద్రోహి. నా ఆత్మగౌరవానికి 2020 నుంచి భంగం కలిగించిందెవరు? 2019 ఎన్నికల విజయం తర్వాత సజ్జల ప్రమేయం ఎలా శృతిమించింది? జగన్‌ను ఎవరూ కలవకుండా గోడ కట్టింది సజ్జల కాదా? అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో విషాద ఘటన..

### ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య

### హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య

### నీట్ పీజీ కోసం సిద్ధమవుతున్న యశ్విత గుర్తింపు

### ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద ఘటన.. కేసు నమోదు చేసిన పోలీసులు

### మృతురాలు కర్నూలుకు చెందిన వ్యాపారి ఏకైక కుమార్తె

హైదరాబాద్‌లో విషాదం చోటుచేసుకుంది. నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ వైద్య విద్యార్థిని శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో, మృతురాలిని కర్నూలుకు చెందిన వ్యాపారి రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తె యశ్వితగా పోలీసులు గుర్తించారు. యశ్విత గత ఆరు నెలలుగా హైదరాబాద్‌లో నివాసమంటూ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ కోసం శిక్షణ పొందుతోంది. శనివారం ఆమె తాను బస చేస్తున్న గదిలోనే బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యశ్విత ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఏకైక కుమార్తె మృతితో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

## ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సూర్యాపేట:ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగడంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అంటూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఎంతో యాతన పడుతున్నామని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు.

**నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు.**



# నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు !

దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి

చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి ప్రక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.



# కేసు నమోదై రోజులైనా అరెస్టు ఎందుకు కాలేదు?

### సురేఖ మాజీ ఓఎస్డీపై ఆర్ఎస్ ప్రవీణ్ సంచలన ఆరోపణలు

**మాజీ ఓఎస్డీ సుమంత్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కాపాడుతున్నారని బీఆర్ఎస్ నేత ఆరోపణ**

**జూబ్లీహిల్స్‌లో ఘటన.. మేడిపల్లిలో జీరో ఎఫ్ఐఆర్ ఎందుకంటూ ప్రశ్న**

**జూబ్లీహిల్స్ సీఐ సస్పెన్షన్‌పైనా ప్రభుత్వాన్ని నిలదీసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

**హైదరాబాద్:** మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు నమోదైనప్పటికీ ఇప్పటి వరకు ఆయనను ఎందుకు అరెస్ట్ చేయలేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. సుమంత్‌ను అరెస్టు కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. జూలై 30న జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్ట్ సమీపంలోని ఓ డెన్‌లో సుమంత్ తన అనుచరులతో కలిసి హరికృష్ణపై రాడ్లతో దాడి చేశారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఘటన జరిగిన మరుసటి రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ సుమారు 20 రోజుల పాటు కేసు నమోదు కాలేదని అన్నారు. చివరకు ఆగస్టు 20న మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. దాడి జరిగిన ప్రాంతం జూబ్లీహిల్స్ కాగా.. సైబరాబాద్ పరిధిలోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక కారణమేంటని ప్రశ్నించారు. ఈ పరిణామం సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపిస్తోందని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తర్వాతే సుమంత్‌పై కేసు నమోదు చేశారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కేసు నమోదైన తర్వాత కూడా అరెస్టు చేయకపోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌ను సస్పెండ్ చేయడంపైనా ప్రవీణ్‌కుమార్ స్పందించారు. కేవలం మూడు వారాల క్రితమే బాధ్యతలు స్వీకరించిన సీఐని ఈ వ్యవహారంలో బలిపశువును చేశారని ఆరోపించారు. సుమంత్ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో జరిగిన పరిణామాలు, కేసు నమోదు ఆలస్యం, జీరో ఎఫ్ఐఆర్, సీఐ సస్పెన్షన్ అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

### ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో

**లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు**



నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా.. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# నేపాల్‌లో మృత్యుంజయులు

**చనిపోయారనుకున్న ఇద్దరు తనయులు రాక**

**కన్నీటి పర్యంత నుంచి తేరుకున్న తల్లి ఆనందబాష్పాలు**



ఖాఠ్మండ్: నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలకు 616 మంది మృతిచెందగా, సుమారు 2,500 మంది గల్లంతయ్యారు. ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో కుటుంబాలు తమ వారిని కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. ఇదే సమయంలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. రెండు రోజుల తర్వాత వారిద్దరూ ప్రాణాలతోనే ఉన్నారని తెలుసుకుని ఊపిరి పీల్చుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. రాసువా జిల్లాకు చెందిన మట్టి మాయా తమాంగ్ (28) అనే మహిళకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్దవాడు జోయల్ ఘలే (8). బుధవారం ఉదయం వారిద్దరూ పాఠశాలకు వెళ్లగా.. కొద్దిసేపటికే భారీ శబ్దం వినిపించడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన తమాంగ్‌కు భయానక దృశ్యం కనిపించింది. వరద నీరు, బురద, రాళ్లు భారీగా ప్రవహిస్తూ ఆ ప్రాంతాన్ని ముంచెత్తాయి. ఇదే క్రమంలో పాఠశాల భవనాన్నీ వరద నీరు ధ్వంసం చేసింది. పిల్లలు వరదల్లో కొట్టుకుపోయి ఉంటారని భావించిన తమాంగ్.. వారిని వెతుక్కుంటూ పలు సహాయక శిబిరాలు తిరిగింది. అయినా వారి ఆచూకీ మాత్రం ఎక్కడా దొరకలేదు. దీంతో కుమారులిద్దరూ చనిపోయారని భావించి గుండెలు పగిలేలా రోదించింది. అయితే చిన్నారి జోయల్ ప్రాణాలతో బయటపడ్డాడు. వరద సమయంలో ఓ స్నేహితుడితో కలిసి పాఠశాల నుంచి అడవిలోకి పారిపోయాడు. వరద నీటి నుంచి తప్పించుకునేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో అతని కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చేతులు, ముఖానికీ గాయాలయ్యాయి. గురువారం నాడు బాలుడిని గుర్తించిన పోలీసులు.. నువాకోట్ జిల్లాలోని 15 పడకల చక్ర దేవ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖాఠ్మాండూ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఓ జర్నలిస్టు సహాయంతో జోయల్ ఆచూకీని తమాంగ్ గుర్తించింది. వెంటనే ఆస్పత్రికి చేరుకుని కుమారుడిని కలుసుకుంది. జోయల్‌ను చూసే వరకూ అతను బతికే ఉన్నాడన్న విషయాన్ని తమాంగ్ నమ్మలేకపోయింది. ఒక్కసారిగా కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. అప్పటికే చిన్న కుమారుడు కూడా దొరకడంతో కథ సుఖాంతమైంది. 8 ఏళ్ల బాలుడు చెట్టు ఎక్కి వరదల నుంచి తప్పించుకొని సురక్షితంగా బయటపడ్డాడు. ఎట్టకేలకు రెండు రోజుల తర్వాత తన తల్లిని తిరిగి కలుసుకోగలిగాడు. నేపాల్‌కు చెందిన జోయల్ ఘలే, అతడి సోదరుడు బుధవారం పాఠశాలకు వెళ్లారు. ధాడింగ్ జిల్లాల్లో వరదల ధాటికి పలు స్కూళ్లు కొట్టుకుపోయాయి. స్థానికంగా ఉన్న ఓ చెట్టును పట్టుకొని జోయల్ ఘలే ప్రాణాలు కాపాడుకున్నాడు. ఒళ్లంతా గాయాలతో రోజంతా చెట్టుపైనే ఉండి సహాయం కోసం ఎదురు చూశాడు. అతడిని రక్షించిన సహాయక బృందాలు వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్చాయి. తన ఇద్దరు కుమారుల కోసం అనేక శిబిరాల్లో వెతికినా ఎక్కడా వారి ఆచూకీ దొరక్కపోవడంతో ఆశలు వదులు కున్నానని బాలుడి తల్లి మాయా తమాంగ్ పేర్కొన్నారు. తన కుమారుడు బతికే ఉన్నట్లు అధికారుల నుంచి సమాచారం అందడంతో నమ్మలేక పోయానన్నారు. అనంతరం మరో కుమారుడిని కూడా స్థానిక అధికారులు రక్షించినట్లు తమకు సమాచారం అందిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ పిల్లలను కాపాడిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ధనిక రాష్టాన్ని అప్పల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

**వడ్డీలకే సంపాదన అంతా ఖర్చు చేస్తున్నాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

సూర్యాపేట:ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగడంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అంటూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఎంతో యాతన పడుతున్నామని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు.

# ప్రాణాలు కాపాడి అమరుడైన పోలీస్

**చైనా బోర్డర్ పోలీస్ హువాంగ్ పెంగ్ సాహసం**

న్యూఢిల్లీ: నేపాల్-చైనా సరిహద్దులో బుధవారం సంభవించిన మెరుపు వరదలు పెను విధ్వంసం సృష్టించాయి. ఈ విపత్తు నుంచి పలువురిని రక్షించిన ఓ పోలీసు.. చివరికి ఆ వరదల్లోనే కొట్టుకుపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. వరద బీభత్స సమయంలో టిబెట్‌లోని గిరాంగ్ పోర్టు వద్ద సహాయక చర్యల్లో చైనా బోర్డర్ పోలీసు హువాంగ్ పెంగ్ పాల్గొన్నాడు. అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురికి సహకరించాడు. ఆ తర్వాత అదే జలప్రళయంలో కొట్టుకుపోయాడు. గిరాంగ్ పోర్టు వద్ద వరద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరదకు ముందు అక్కడి నుంచి తాము సురక్షితంగా బయటపడడానికి బోర్డర్ కాప్ సహాయం చేశారని.. తమను కాపాడి, ఆయన ప్రాణాలు వదిలారని పలువురు వ్యక్తులు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఆయనను ఓ హీరోలా అభివర్ణించారు. వీడియో ఆధారంగా అతడిని గిరాంగ్ పోర్టులో విధులు నిర్వహిస్తున్న చైనా ఇమిగ్రేషన్ పోలీసు అధికారి హువాంగ్‌గా గుర్తించారు.

# కూకట్ పల్లి నియోజకవర్గానికి 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి చేసిందేమీ లేదు

**కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందింది... బహిరంగ చర్చకు సిద్ధమా?**

**మొదటిసారి కౌన్సిలర్ గా పోటీ చేసినప్పుడు నీ ఆస్తులు ఎంత ప్రస్తుతం మీ ఆస్తుల విలువ ఎంత...?**

**నియోజకవర్గంలోని చెరువులను, నాళాలు, కుంటలను కబ్జా చేసి సొమ్ము చేసుకున్నది ఎవరు?**

**22ఏ విషయంలో కృష్ణారావు ఉరి, హత్య, ఆత్మహత్య" అంటూ ప్రజల సానుభూతి కోసం నాటకాలు**

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన బండి రమేష**



**కూకట్ పల్లి, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** పది సంవత్సరాలు శాసనసభ్యుడుగా ఉన్న కృష్ణారావు కూకట్ పల్లి నియోజకవర్గానికి చేసిందేమీ లేకపోగా స్థాయిని మించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చౌకబారు విమర్శలు చేస్తున్నాడని ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ తాము సహించబోమని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కృష్ణారావు హయాంలో నియోజకవర్గ పరిధిలోని చెరువులు నాళాలు కుంటలు మొత్తం కబ్జా చేశారని ఆయన ధ్వజమెత్తారు హస్మత్ పేట సర్వే నెంబర్ వన్ లో 100 ఎకరాలకు పది ఎకరాలు మిగిల్చారని అల్లాపూర్ లో నాలుగు ఎకరాలకు 2 ఎకరాలు, గోపాల్ నగర్లో 10 ఎకరాల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి కృష్ణారావు అతని అనుచరులు సొమ్ము చేసుకున్నారని రమేష్ విమర్శించారు. పిజెఆర్ హయాం నుంచి నేటి వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై టిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని రమేష్ సవాల్ విసిరారు. మొదటిసారి కౌన్సిలర్ గా పోటీ చేసినప్పుడు నీ ఆస్తులు ఎంత ప్రస్తుతం మీ ఆస్తుల విలువ ఎంత అంటూ ఎమ్మెల్యే కృష్ణారావును ప్రశ్నించారు బండి రమేష్ శనివారం కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే టిఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరిగారు. 22 ఏ విషయంలో కృష్ణరావు " ఉరి, హత్య, ఆత్మహత్య" అంటూ ప్రజల సానుభూతి కోసం నాటకాలు ఆడుతున్నాడని అతన్ని చంపాల్సిన అవసరం మాకు లేదన్నారు ముఖ్యమంత్రిపై విమర్శలు చేసే సమయంలో నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రమేష్ కృష్ణారావును హెచ్చరించారు. హౌసింగ్ బోర్డ్ స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటుందన్న కృష్ణారావు విమర్శ పై రమేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు టిఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా అమ్ముకున్నారని అది నీకు కనిపించలేదా అని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంగా వారికి ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు, గ్యాస్, రేషన్ కార్డులు పంపిణీ, పెట్రోల్ బంకులు, బస్సులు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రానున్న ప్రతి ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఫ్లైఓవర్లు అండర్పాస్ బ్రిడ్జిలు, లింకు రోడ్స్, స్కై వాక్ వంతెనలు నిర్మిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల వైద్యం కోసం రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం రాగానే 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, విద్యా విధానంలో నూతన వరవడిని ప్రవేశపెట్టిందన్నారు.

## చండూరు సర్కిల్ డైరెక్టర్ గా కావలి నరసింహ

మునుగోడు క్రైమ్ మిర్రర్: నల్లగొండ జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో చండూరు సర్కిల్ నుండి డైరెక్టర్ గా మునుగోడు పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కావలి నరసింహ పోటీ చేసి గెలుపు పొందారు. ఈ సందర్భంగా ఆర్ ఓ రాంబాబు నరసింహ కు నియామక పత్రం అందజేశారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నరసింహ మాట్లాడుతూ..పోలీసుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. సి ఐ రాము తదితరులు ఉన్నారు.



## ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్):** కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాధవ్‌బాగ్ అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద క్లినిక్స్ ఍ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కొలెస్ట్రాల్, రక్తపోటు, థైరాయిడ్, అధిక బరువు వంటి జీవనశైలి సంబంధిత సమస్యలపై ప్రజలు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ మెగా మెడికల్ క్యాంప్‌లో ఉచిత ల్యాబ్ పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, డైట్ సలహాలు, వ్యక్తిగత ఆయుర్వేద మార్గదర్శకత్వం, జీవనశైలి కౌన్సెలింగ్ వంటి సేవలను అందించడం పట్ల నిర్వాహకులను ఆయన అభినందించారు.ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహించాలని రాజేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుమారస్వామి, రఘురాం, మాధవ్ బాగ్ క్లినిక్ వారి సభ్యులు స్థానిక బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి అభ్యర్థి ఎంపికలో భాగంగా అభిప్రాయ సేకరణ




**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి అభ్యర్థి ఎంపిక కోసం పార్టీలోని వివిధ విభాగాల నాయకులు, సభ్యులు, కార్యకర్తలను నేరుగా కలిసి అభిప్రాయ సేకరణ చేపట్టే కార్యక్రమంలో భాగంగా, జిల్లా వ్యాప్త పర్యటన శనివారం కడ్తాల్ లో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఏఆర్ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశీలకుడిగా విచ్చేసిన ముఖ్య అతిథి, కర్ణాటక శాసన మండలి సభ్యులు, ఏఐసీసీ జాతీయ కార్యదర్శి పి.వి. మోహన్, పార్టీ కో ఆర్డినేటర్ ఇవి శ్రీనివాస్, ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిసి, రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాఖీ కట్టి వారి దీవెనలు పొందారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లెనిన్ నగర్ లో మీర్పేట్ పోలీసుల కార్డెన్ సెర్చ్

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మీర్పేట్ పోలీసులు లెనిన్ నగర్ మరియు పరిసర ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్డెన్ సర్చ్ తనిఖీల్లో భాగంగా నలుగురు రౌడీషీటర్లు మరియు ముగ్గురు అనుమానితులను గుర్తించి విచారించడం జరిగింది. అంతేకాకుండా 26 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో రిక్షా, రెండు సిలిండర్లు, 4 వేల విలువ చేసే గుట్కా తో పాటు 2.5 లీటర్ల మద్యాన్ని మీర్పేట్ పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అలవాటుగా నేరాలకు పాల్పడే వారిని గుర్తించడం, అక్రమ కార్యక్రమాలను నివారించడం, అనుమానాస్పద కదలికలను తనిఖీ చేయడం మరియు స్థానిక నివాసితుల భద్రత లక్ష్యంగా, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు క్రమం తప్పకుండా కొనసాగుతాయని మీర్పేట్ ఇన్స్పెక్టర్ శోభన్ తెలిపారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు ఫీజుల బకాయిలు బిజెపి లడాయి అనే కార్యక్రమంతో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ శంషాబాద్ లో నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావంగా మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములు, జిల్లా కార్యదర్శి దేవేందర్ రెడ్డి తో పాల్గొన్న జిహెచ్ఎంసి 59వ డివిజన్ జిల్లెలగూడ బిజెపి నాయకులు ఒంటేరు నరసింహారెడ్డి

(బాలాపూర్ బాలాపూర్)

## సిఈఐఆర్ పోర్టల్‌తో పోగొట్టుకున్న ఫోన్లు లభ్యం

**రూ.15 లక్షల 50 వేల విలువగల 98 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత**

**బాలానగర్ డివిజన్ ఏసీపీ నరేష్ రెడ్డి**





**బాలానగర్, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్ ఏసీపీ డివిజన్ పరధిలోని బాలానగర్, అల్లాపూర్, కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు బాలానగర్ డివిజన్ పోలీసులు ఊరటనిచ్చారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్వాధీనం చేసుకున్న 98 మొబైల్ ఫోన్లను, దాదాపు రూ.15 లక్షల 50 వేలు ఉంటుందని, శనివారం ఏసీపీ నరేష్ రెడ్డి తన కార్యాలయంలో బాధితులకు స్వయంగా అందజేశారు. ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లోని సైబర్ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. సిఈఐఆర్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్ల వివరాలను నమోదు చేస్తే, సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని త్వరగా గుర్తించి యజమానులకు అప్పగిస్తామని తెలిపారు.అనంతరం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించి ఫోన్లను రికవరీ చేసిన బాలానగర్ సీఐ ప్రశాంత్, అల్లాపూర్ సీఐ నవీన్ కుమార్, కూకట్ పల్లి సీఐ స్వామి గౌడ్, డీఐలు బానోత్ సక్రమ్, శేఖర్ రెడ్డి, క్రైమ్ టీమ్ ఏఎస్ఐ హనుమయ్య, కానిస్టేబుల్ లను ఇతర సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

## ఎస్.టి.పి ప్లాంట్ నుంచి వస్తున్న దుర్వాసన... భారీ శబ్దాలతో ఇబ్బంది పడుతున్న స్థానిక ప్రజలు

**తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలాజీ నగర్ లోని రెయిన్బో విస్తా వద్ద ఎస్.టి.పి ప్లాంట్ ను శనివారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ప్రధానంగా ఆ చుట్టుపక్కల ప్రాంత ప్రజలు ఎస్.టి.పి ప్లాంట్ నుంచి వస్తున్న దుర్వాసన, భారీ శబ్దాలతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫతేనగర్, కెపిహెచ్బి ప్రాంతాల్లో నిర్మించిన ప్లాంట్లు వద్ద ఈ సమస్య లేదని ఇక్కడే ఎందుకు ఈ విధంగా వస్తుందో అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కారం చూపాలని, లేనియెడల తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించే దిశగా వెళ్లాలని ఏమైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2007 నుంచి సేవలందిస్తున్న ఆరోగ్య మిత్రాలే టీం లీడర్స్- గిరి యాదయ్య

**హైదరాబాద్(క్రైమ్ మిర్రర్):** ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో 2007 సంవత్సరం నుంచి, ఆరోగ్య మిత్రాలుగా విధులు నిర్వహిస్తూ పేద, నిరుపేద ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న, సీనియర్ ఆరోగ్య మిత్రాలకు టీం లీడర్స్‌గా అవకాశం కల్పించాలని ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ కేంద్ర కార్యాలయంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్, జనరల్ మేనేజర్ నరేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఆరోగ్య మిత్రాలు క్షేత్రస్థాయిలో, కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందే, వైద్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు, చికిత్సకు సంబంధించిన ప్రక్రియలు, పథకం ద్వారా లభించే ప్రయోజనాలపై వారికి మార్గనిర్దేశం చేస్తూ, ఆరోగ్య మిత్రాలు నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆరోగ్యశ్రీ వ్యవస్థపై పూర్తి అవగాహన, క్షేత్రస్థాయి అనుభవం ఉందని తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాలుగా సంస్థకు సేవలందిస్తున్న ఉద్యోగుల సీనియారిటీ, అనుభవాన్ని గుర్తించి టీం లీడర్స్ నియామకాల్లో, వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గిరి యాదయ్య కోరారు. 2007 నుంచి నిరంతరంగా ఆరోగ్య మిత్రాలుగా పనిచేస్తున్న వారిని మాత్రమే, అర్హతకు ప్రాధాన్యతగా పరిగణించి టీం



లీడర్స్‌గా అవకాశం కల్పిస్తే వారి దీర్ఘకాలిక సేవలకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. అనుభవజ్ఞులైన ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించడం వల్ల, ఆరోగ్యశ్రీ సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంవత్సరాల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న, ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలను కూడా వినతిపత్రంలో ప్రధానంగా ప్రస్తావించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఉద్యోగుల వేతనాలు వారి బాధ్యతలకు అనుగుణంగా లేవని, దీనితో అనేక మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగుల సేవలను గుర్తించి వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య మిత్రాలు విధుల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లోని ఆసుపత్రులు, ప్రజలను సంప్రదిస్తూ సేవలు అందించాల్సి వస్తుందని, ఇందుకోసం ప్రయాణ ఖర్చులు కూడా ఉద్యోగులపైనే పడుతున్నాయని, ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య తెలిపారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రయాణ ఖర్చులు అదనపు భారంగా మారుతున్న నేపథ్యంలో, రాష్ట్రంలోని ఆరోగ్యశ్రీ ఉద్యోగులందరికీ నెలకు 5 వేలు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ తక్షణమే మంజూరు చేయాలని కోరారు. గతంలో ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఇక ఆలస్యం చేయకుండా నిర్ణయం తీసుకోవాలని, జనరల్ మేనేజర్ నరేష్ కుమార్‌కు అందజేసిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య మిత్రాలు పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఆరోగ్యశ్రీ పథకం ప్రయోజనాలు వారికి చేరేలా కృషి చేస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం, ట్రస్ట్ యాజమాన్యం గుర్తించాలని కోరారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, 2007 నుంచి సేవలందిస్తున్న సీనియర్ ఆరోగ్య మిత్రాలకు టీం లీడర్స్‌గా అవకాశం కల్పించడంతో పాటు, ప్రతి ఉద్యోగికి నెలకు 5 వేల ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరి యాదయ్య కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమైతే వారు మరింత ఉత్సాహంతో, అంకితభావంతో పేద ప్రజలకు సేవలు అందించే అవకాశం ఉంటుందని గిరి యాదయ్య అన్నారు.



## కోదాడలో సీఐ శివశంకర్ దిష్టిబొమ్మ దగ్ధం..

### సీఐను వెంటనే సస్పెండ్ చేయాలని యాదవ సంఘం, ఓయూ జేఏసీ నేతల డిమాండ్

**కోదాడ ఆగస్టు 29 క్రైమ్ మిర్రర్ :** కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో సీఐ శివశంకర్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణంలోని ఖమ్మం చౌరస్తాలో యాదవ కుల సంఘం, ఓయూ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళనకారులు సీఐ శివశంకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఇటీవల పట్టణంలో డబ్బా కొట్టు తొలగించిన ఘటనకు సంబంధించి ధర్నాకు దిగిన బాధితులపై సీఐ దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ ఆందోళన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. బాధితులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళనకారులు రంగ చౌరస్తా వైపు వెళ్లి అక్కడ మరోసారి సీఐ శివశంకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అప్రమత్తమై ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. మరోవైపు బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. పోలీసుల వ్యవహారశైలిపై ఉన్నతాధికారులు స్పందించి, ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు కోరారు.

## నేత్రదానంతో జీవితాల్లో వెలుగులు

### విద్యార్థులకు అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది



**మంచిర్యాల: ఆగస్టు 29 ( క్రైమ్ మిర్రర్) :** నేత్రదానం ద్వారా మరొకరికి కంటిచూపు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని వైద్యాధికారులు తెలిపారు. నేత్రదాన ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేత్రదాన అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం సాయికుంటలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వ్యాధులు, కంటి చూపు పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. నేత్రదానం ద్వారా మరొకరికి కంటిచూపు ప్రసాదించే అవకాశం ఉందని, దీని ప్రాముఖ్యతను తల్లిదండ్రులు, గ్రామస్థులకు కూడా తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జాండీస్, టైఫాయిడ్ వంటి నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శుభ్రమైన నీటిని తాగడంతో పాటు వేడి ఆహారం తీసుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఏపీడీ మలేరియా సుమన్, జిల్లా కంటి నియంత్రణ సమన్వయకర్త శంకర్, సీహెచ్‌వోలు నాందేవ్, పుట్ట సత్తయ్య, కాకిరాల వెంకటేశ్వర్లు, ఆర్.ఎస్. పద్మ, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి



**రామకృష్ణాపూర్: ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీనియర్ క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్, డిప్పు శ్రీనివాస్, రాము, వేణు, రంజిత్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## బడుగుల ఐక్యతతోనే రాజ్యాధికారం



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఆగస్టు 29: బడుగు వర్గాల రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని శ్రీని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బుద్ధుడు, అశోకుడు, సంత్ రవిదాస్, సంత్ కబీర్‌దాస్, ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా జ్యోతిరావు పూలే, సాహూ మహారాజ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కాన్షీరాంల ఆశయాలను తెలంగాణలో ముందుకు తీసుకెళ్లడమే జేఏసీ లక్ష్యమన్నారు. సమ్మక్క-సారలమ్మ, సర్వాయి పాపన్నగౌడ్, పండుగ సాయన్న, కొండా లక్ష్మణ్ బాపూజీల ఆత్మగౌరవ స్ఫూర్తితో రాజ్యాధికార అజెండాను పునర్నిర్మించేందుకు జేఏసీ ఏర్పడిందని తెలిపారు.

**'మాయమాటలతో బడుగులను తప్పుదోవ పట్టించారు'**

దాదాపు 80 ఏళ్లుగా అగ్రకుల నాయకుల మాయమాటలతో బీసీ, ఎస్సీ, ఎస్టీల పౌరుషం, ఆలోచనా శక్తి, పోరాట స్ఫూర్తి దారి తప్పాయని విశారదన్ మహారాజ్ విమర్శించారు. దీంతో ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో గుర్తించలేని పరిస్థితి ఏర్పడి బడుగు వర్గాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని అన్నారు. అగ్రకుల భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాలు మిత్రులుగా కనిపించేలా పరిస్థితులు మారాయని ఆరోపించారు. అగ్రకుల మేధావులు ఆడిన రాజకీయ, సామాజిక ఆటలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు బలిపశువులయ్యారని పేర్కొన్నారు. పూలే, అంబేడ్కర్, కాన్షీరాంల సామాజిక న్యాయం, రాజ్యాధికార లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.


**'90 శాతం వర్గాలు ఏకమవ్వాలి'**

2025 మార్చి 31న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆవిర్భవించినప్పటి నుంచి 'మా భూమి రథయాత్ర' ద్వారా తెలంగాణవ్యాప్తంగా సామాజిక న్యాయం, రాజ్యాధికారంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేపట్టినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు వివిధ వర్గాలు జేఏసీగా ఏర్పడి ఉద్యమించాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో తెలంగాణలోని 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు ఏకమై రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, ఉపాధ్యక్షుడు రాసాల వినోద్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కమల్ రెడపాక, డాక్టర్ జె. రాజు, చిరుమర్రి కృష్ణయ్య, వజ్జగిరి అంజయ్య, టి. అర్జున్, తరి ఎల్లయ్య, నీలకంఠ నాయక్, వెంకటేష్, లక్ష్మణ్, ఏఐఎంఐఎం జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారుక్, మాసరి కళ్యాణ్, మల్లికార్జున్, రాము, దేవేందర్, నగేష్, శివ, హాఫిజుద్దీన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేస్తున్న కాటూరి వెంకటేశ్వర్లు

### రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కాటూరి పాదయాత్ర

### స్వాగతం పలికిన పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ నాయకులు



**వనపర్తి ఆగస్టు 29 క్రైమ్ మిర్రర్ :** 2029 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాలనే మహత్తర ఆకాంక్షతో కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన కన్యాకుమారి నుండి కాశ్మీర్ మహా పాదయాత్ర లో భాగంగా శనివారం పెబ్బేరు పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పెబ్బేరు పట్టణ,మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ?పట్టణ సరిహద్దు వద్దకు చేరుకున్న కాటూరి వెంకటేశ్వర్లును.మున్సిపల్ చైర్మన్ అక్క శ్రీనివాస్ గౌడ్.శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ. దేశంలో ప్రజాస్వామ్య రక్షణ, సామాజిక న్యాయం చేకూరాలంటే రాహుల్ గాంధీ నాయకత్వం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. అంకితభావంతో సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్న వెంకటేశ్వర్లు గారి కృషిని కొనియాడారు.బి ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్ సాగర్ సురేందర్ గౌడ్ యుగంధర్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ బుర్ర ముని రాములు యాదవ్ రణధీర్ రెడ్డి సత్యనారాయణ నిరంజన్ రెడ్డి రజాక్ నరసింహా రమణ జగదీశ్వర్ రెడ్డి యూత్ అధ్యక్షుడు రాజేషు వినయ్ కుమార్ ఉత్తమ్ కుమార్ షకీల్ . పెంచికలపాడు జయన్న పెద్ద రాముడు రాజు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఒకే నెంబర్ ప్లేట్ తో రెండు ట్రాక్టర్ ట్రాలీలు

### సీజ్ చేసిన వెహికల్ ఇన్స్పెక్టర్

### నిభందనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జానకిరాములు

**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల :** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో నర్సాయిగూడెం వద్ద మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జానకిరాములు శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో , ఓవర్ లోడ్ తో పాటు టీఎస్ 29టీ 0304 ఒకే నెంబర్ తో తిరుగుతున్న రెండు ట్రాక్టర్ ట్రాలీలను గుర్తించారు. రెండు వాహనాలను సీజ్ చేసి నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిలీ నెంబర్ ప్లేట్ తో తిరగడం మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం నేరమని, మోటార్ వెహికల్ యాక్ట్ పలు సెక్షన్ కింద కేసు నమోదు చేశామని అన్నారు.నిభందనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జానకిరాములు తెలిపారు.

## కాటేదాన్‌లో 2 కిలోల గంజాయి స్వాధీనం

### ముగ్గురిని అదుపులోకి తీసుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ వివరాల ప్రకారం కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్‌కు చెందిన షిబా జెనా (24), రాజేంద్ర జెనా కుమారుడు, రాజు ఘడాయి (32), దైత్యరాయ్ ఘడాయి కుమారుడు, దీపక్ కుమార్ సాహు (30), రామకాంత్ సాహు కుమారుడుగా గుర్తించారు. వీరిలో షిబా జెనా, రాజు ఘడాయి కూలీలుగా పనిచేస్తుండగా, దీపక్ కుమార్ సాహు పాన్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# క్యాతనపల్లి కాంగ్రెస్ లో కొత్త జోష్!

## వోడ్నాల శ్రీనివాస్ నాయకత్వంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం..

## పార్టీని ఏకతాటిపై తెస్తూ ప్రజా సమస్యలపై దృష్టి



**రామకృష్ణాపూర్ ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు కనిపిస్తోంది. పట్టణ అధ్యక్షుడిగా వోడ్నాల శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. గతంలో జిల్లా అధికార ప్రతినిధిగా సేవలు అందించిన ఆయన అనుభవాన్ని గుర్తించిన పార్టీ అధిష్ఠానం పట్టణ అధ్యక్షుడిగా నియమించింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. గతంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా క్యాతనపల్లి పట్టణంలో పార్టీకి ఆశించిన స్థాయిలో రాజకీయ బలం కనిపించేది కాదు. దశాబ్దాలా కాలంగా జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ పార్టీ అధికార పీఠాన్ని అందుకోలేకపోయింది. ఈ పరిస్థితిని మార్చే దిశగా శ్రీనివాస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

**క్యాడర్‌ను ఏకతాటిపైకి..**

పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ సమన్వయానికి ప్రాధాన్యమిస్తున్నారు. మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు బూత్ స్థాయిలో క్యాడర్‌ను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. పాత, కొత్త నాయకులతో పాటు కౌన్సిలర్లు, యువతను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, పార్టీ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యం కల్పించడం ద్వారా క్యాడర్‌లో నమ్మకాన్ని పెంచుతున్నారు.

**ప్రజా సమస్యలపై దృష్టి**

కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా స్థానిక ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్య లోపాలపై వార్డుల్లో నిరంతరం పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన సందర్భాల్లో మంత్రి, దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. దీంతోపార్టీ కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజల్లోనూ కాంగ్రెస్ నాయకత్వంపై విశ్వాసం పెరుగుతోంది.

**విమర్శలకు కౌంటర్..**

మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి వచ్చే విమర్శలకు కాంగ్రెస్ తరఫున ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రతిపక్ష ఆరోపణలకు రాజకీయంగా కౌంటర్ ఇస్తున్నారు. మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పాలకవర్గం కొనసాగుతున్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ తరఫున తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

**ముందే పుంజుకుని ఉంటే..**

గత మున్సిపల్ ఎన్నికలకు ముందే శ్రీనివాస్ వంటి చురుకైన నాయకత్వం పార్టీకి అందుబాటులో ఉండి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. ఎన్నికలకు ముందుగానే నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసి ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లి ఉంటే మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునే అవకాశాలు ఉండేవని పలువురు పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**రానున్న ఎన్నికలే లక్ష్యంగా..**

రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై శ్రీనివాస్ దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. బూత్ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని పటిష్ఠం చేసి, నాయకులు,కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం ఆయన చురుకైన నాయకత్వంతో క్యాతనపల్లి కాంగ్రెస్‌లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఇదే దూకుడు కొనసాగితే రానున్న రోజుల్లో పట్టణంలో కాంగ్రెస్ రాజకీయంగా మరింత బలపడే అవకాశాలున్నాయని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



## ఉత్తమ్ దంపతులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

### కాంగ్రెస్ నాయకులు

**కోదాడ ఆగస్టు 29 క్రైమ్ మిర్రర్ కోదాడ :**ఉత్తమ్ దంపతులు కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని వారు చేసిన అభివృద్ధిపై చర్చకి రావాలని వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కోదాడ మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.శనివారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని వారు మాట్లాడుతూ గత 5 ఏళ్ల ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి ఇప్పుడు జరిగిన అభివృద్ధిపై చర్చకు దమ్ము, ధైర్యం ఉంటే సమయము, ప్లేసు చెబితే అక్కడికి వస్తామని కానీ పుణ్య దంపతులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే మా తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. కౌన్సిలర్ గా ఓడిపోయిన ఉపేందర్ అనే వ్యక్తి డబ్బా కొట్టు పెట్టుకొని బ్రతుకుతున్నాడు అన్న పదానికి అర్థం లేదని ఉత్తమ్ దంపతులు క్షుద్ర పూజలు చేస్తున్నారు అనటం సిగ్గుమాలిన చర్య అని దీని వెనక బొల్లం మల్లయ్య యాదవ్ హస్తం ఉందని అన్నారు. ఇలా అన్న వ్యక్తిని పట్టణ సిఐ ఏ ఆయుధం లేకుండా అతనిని అదుపులోకి తీసుకోవటం దానిని కూడా రాజకీయం చేయటం సబబు కాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ యువకులను రెచ్చగొట్టి ఈ విధంగా అనిపించటం వారి భవిష్యత్తుని నాశనం చేయడం ఘోరమైన చర్యఅని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవాకులు చవాకులు పేలితే కాంగ్రెస్ సైన్యం పొరపాటున కూడా ఊరుకోదని హెచ్చరించారు.ఈ సమావేశంలో కోదాడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అలసకాని సరభేశ్వరరావు ,మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కొత్తా గురువయ్య, కాంగ్రెస్ నాయకులు భాష బోయిన భాస్కరరావు, సీతారాంరెడ్డి, నంబూరి సూర్యం,నలజాల శ్రీనివాసరావు,మండల వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ లడాయి

### రూ.15 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శంషాబాద్ పరిధిలో నిరాహార దీక్ష చేపట్టారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. నిరాహార దీక్షలో రాష్ట్ర నాయకులు వై. శ్రీధర్, తోకల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమురయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నిరసనకు సంఘీభావంగా బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి అన్నపురెడ్డి స్వర్ణలత రెడ్డి, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ అన్నపురెడ్డి భీమ్ అర్జున్ రెడ్డి పాల్గొని ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## క్షేత్రస్థాయి నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలతోనే డీసీసీ అధ్యక్షుడి ఎంపిక



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా, ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి మరియు రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ వైఎఆర్ గార్డెన్ లో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ నాయకత్వం, ఆలోచనలు మరియు మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. పార్టీ కామ్‌దార్ -- నైతికత -- లక్ష్యం -- వ్యూహం" అనే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తూ, ప్రజలకు చేరువైన సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసే కామ్‌దార్, ప్రజాసేవలో నైతికత, కాంగ్రెస్ సిద్ధాంతాలపై స్పష్టమైన లక్ష్యం, ఎన్నికలు మరియు సంస్థాగత నిర్మాణంపై సమర్థవంతమైన వ్యూహం కలిగిన నాయకత్వం ద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పి.వి. మోహన్ పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని తెలిపారు.

## ఫీజుల బకాయిలపై బీజేపీ లడాయి

### రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిరసన దీక్ష నిర్వహించారు. ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్రంలోని దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందుల్లోకి నెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ నిరసన దీక్ష కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నాన్నవాళ్ల కుమార్ యాదవ్, బీజేవైఎం శంషాబాద్ మండల అధ్యక్షుడు బుక్క ప్రవీణ్ కుమార్, మెండే కుమార్ యాదవ్, నాగేష్ గౌడ్, ఎలగల బిక్షపతితో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యకు ఆటంకాలు లేకుండా ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.




# కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం

### ఎంపీ నిధులు ప్రజలకు ఉపయోగపడేలా ఖర్చు చేస్తున్నాం: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే తెలంగాణలో భారీగా రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎంపీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎంపీకి ఏడాదికి రూ.5 కోట్ల ఎంపీ నిధులు వస్తాయని, నియోజకవర్గం చిన్నదైనా.. పెద్దదైనా నిధుల కేటాయింపులో మార్పు ఉండదని తెలిపారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనకే ఎంపీ నిధులను ప్రాధాన్యతగా వినియోగిస్తున్నామని ఆయన చెప్పారు. ఇప్పటివరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.25 కోట్ల వరకు ఎంపీ నిధులు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వికారాబాద్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి సుమారు 300 రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని ఎంపీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అందించే నిధులకు ఎంపీ నిధులను జోడించి సుమారు రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. తెలంగాణలో రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి 90 శాతం వరకు నిధులు అందుతున్నాయని కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. హైవేలు, సీఆర్ఐఎఫ్ (CRIF) నిధులతో చేపడుతున్న రోడ్ల నిర్మాణాలకు కూడా కేంద్ర ప్రభుత్వ నిధులే ప్రధాన ఆధారమని అన్నారు.మొయినాబాద్‌లో సీఆర్ఐఎఫ్ నిధులతో సుమారు రూ.30 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని, ఆలూరులో కూడా రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎంపీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, బీజేపీ సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాష్, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా , చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్లు, బీజేపీ మండల అధ్యక్షులు, ఇతర నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇది జిల్లా ఎడిషన్ పేపర్‌లో వచ్చే రాజకీయ–అభివృద్ధి కథనం శైలిలో రూపొందించాను. కావాలంటే దీనికి మరింత ??పవర్‌ఫుల్ హెడ్‌లైన్ ం 2 లైన్ల సబ్‌హెడ్ కూడా తయారు చేయగలను.

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

**క్రైమ్ మిర్రర్ , నేరేడుచర్ల :** నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామ శివారులో శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో గ్రామానికి చెందిన బట్టు సతీష్ (43) మృతి చెందినట్లు నేరేడుచర్ల ఎస్సై రాజగోపాల్ రెడ్డి శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దిర్శించెర్ల గ్రామ శివారులో తిరుమలగిరి సైదులు వ్యవసాయ పొలం లో గల ట్రాన్స్ ఫార్మర్ కి గల ఫ్యూస్ ను వేసే క్రమంలో అక్కడ ఉన్న చెట్టుని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు ఆ చెట్టు 11 కేవి విద్యుత్ వైరుకి తగిలి కరెంటు షాక్ వలన సతీష్ అక్కడికి అక్కడనే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.మృతుని భార్య బట్టు ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.







# ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ నిరాహార దీక్ష

గండిపేట(క్రైమ్ మిర్రర్): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ చేపట్టిన ఫీజు బకాయి -- బీజేపీ లడాయి"కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ చౌరస్తాలో ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ శంషాబాద్ డివిజన్ చౌరస్తాలో నిర్వహించిన ఈ దీక్షకు బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ నాయకత్వం వహించారు. ఆయన చేపట్టిన నిరాహార దీక్షకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళనలను మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, శ్రీధర్, మల్లారెడ్డి, మమత, బొక్క బాల్ రెడ్డి, వెంకయ్య, సేవెల్ల మహేందర్, అంజన్ కుమార్, అభినవ్ గౌడ్, బతుకు శ్రీనివాస్ యాదవ్, మహేష్ యాదవ్, వంశీ యాదవ్, నిరుడు శేఖర్, పవన్ సాయి, నాగేష్, రవికాంత్, ఎస్. వెంకటేష్, పి. సందీప్, ఏ. జనార్ధన్, జి. పాండు యాదవ్, వీరేందర్, బబ్లూ, శ్రీకాంత్ రెడ్డి తదితర జిల్లా, మున్సిపాలిటీ, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంజీఐటీలో మెటీరియల్స్ క్యారెక్టరైజేషన్‌పై వర్క్‌షాప్

## ఎక్స్‌ఆర్‌డీ, ఎస్ఈఎం, డీఎఫ్‌టీ సిమ్యులేషన్‌పై నిపుణుల అవగాహన

గండిపేట(క్రైమ్ మిర్రర్): గండిపేటలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో మెటీరియల్స్ క్యారెక్టరైజేషన్ టూల్స్ (ఎక్స్‌ఆర్‌డీ, ఎస్ఈఎం) మరియు డెన్సిటీ ఫంక్షనల్ థియరీ (డీఎఫ్‌టీ) సిమ్యులేషన్ అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంజీఐటీ భౌతికశాస్త్ర, రసాయనశాస్త్ర విభాగాలు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్) సహకారంతో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. అధునాతన పదార్థాల లక్షణ నిర్ధారణ పద్ధతులు, వాటి పరిశోధనా అనువర్తనాలపై అధ్యాపకులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులకు అవగాహన కల్పించడమే వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఎంజీఐటీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటువంటి వర్క్‌షాప్‌లు పరిశోధనకు అవసరమైన ప్రాయోగిక పరిజ్ఞానంతో పాటు వాస్తవ అనుభవాన్ని అందిస్తాయని అన్నారు. ముఖ్యంగా ఎక్స్‌ఆర్‌డీ వంటి సాంకేతికతలు సిమ్యులేషన్లు, పరిశోధన ఆధారిత అధ్యయనాల్లో విద్యార్థులు, అధ్యాపకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జోనల్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ బి.ఎన్. రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించడమే టీఏఎస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభ్యసిస్తూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వర్క్‌షాప్ ముఖ్య



అతిథి, టీఏఎస్ కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ.. మౌలిక పరిశోధనకు విద్యాసంస్థలే పునాదులని అన్నారు. అధ్యాపకులు తమ సంస్థల్లో పరిశోధనా కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, జాతీయ స్థాయిలో పరిశోధన అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. వర్క్‌షాప్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎ.కె. సింగ్ ప్రారంభోపన్యాసంలో పదార్థాలు, వాటి లక్షణ నిర్ధారణకు బహుళశాఖా దృక్పథం ఎంతో ముఖ్యమని వివరించారు. వివిధ శాస్త్రీయ, సాంకేతిక రంగాల్లో పరిశోధన పురోగతికి మెటీరియల్స్ క్యారెక్టరైజేషన్ పద్ధతులపై సమగ్ర అవగాహన అవసరమని తెలిపారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు సుమారు 100 మంది ఆన్‌లైన్ ద్వారా, 60 మంది ప్రత్యక్షంగా హాజరయ్యారు. సాంకేతిక సమావేశాల్లో డీఎంఆర్ఎల్, హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ ఆశిష్ పాఠక్ డెన్సిటీ ఫంక్షనల్ థియరీ (డీఎఫ్‌టీ), దాని వివిధ రంగాల్లోని అనువర్తనాలపై ప్రసంగించారు. అలాగే ఏఆర్‌సీఐ, హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ కె. సురేష్ ఎక్స్‌ఆర్‌డీ ఆధారిత రీట్‌వెల్డ్ రిఫైన్‌మెంట్‌పై సవివరంగా అవగాహన కల్పించారు. సాంకేతిక అంశాలపై నిపుణుల నుంచి నేరుగా తెలుసుకునే అవకాశం లభించడంతో విద్యార్థులు, పరిశోధకులు ఆసక్తిగా పాల్గొన్నారు. వర్క్‌షాప్ ముగింపులో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు. ఎంజీఐటీ భౌతికశాస్త్ర, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి. వేణుగోపాల్ రావు వందన సమర్పణ చేసి ముఖ్య అతిథులు, వనరుల నిపుణులు, ప్రతినిధులు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంజీఐటీ సిబ్బందితో పాటు వివిధ విద్యాసంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం మెటీరియల్స్ క్యారెక్టరైజేషన్ సాంకేతికతలపై జ్ఞానాన్ని పంచుకునేందుకు, పరిశోధన అవకాశాలను విస్తరించేందుకు వేదికగా నిలిచింది.

# ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో చోరీ బైక్ గుర్తింపు

## గోపాల్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుతో సంబంధం ఉన్న ద్విచక్ర వాహనం స్వాధీనం



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో చోరీకి గురైన ద్విచక్ర వాహనం గుర్తించారు. శనివారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం ఏపీ09సీఏ5863 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలించగా, సదరు వ్యక్తి చెల్లుబాటు అయ్యే వాహన పత్రాలను చూపించలేకపోయాడు. దీంతో వాహనానికి సంబంధించిన వివరాలను పోలీసులు మరింతగా పరిశీలించగా, సదరు మోటార్‌సైకిల్ గోపాల్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసుతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని సంబంధిత గోపాల్‌పురం పోలీస్‌స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం అవసరమైన పత్రాలను స్వీకరించి, తదుపరి దర్యాప్తు, చట్టపరమైన చర్యల నిమిత్తం మోటార్‌సైకిల్‌ను సంబంధిత పోలీసులకు అప్పగించినట్లు ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన తనిఖీల ద్వారా చోరీకి గురైన వాహనం గుర్తించడం పట్ల పోలీసులు అప్రమత్తతను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ఎంజీఐటీ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కళాశాల శారీరక విద్య విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో విద్యతో పాటు క్రీడలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో ఏదో ఒక క్రీడను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంజీఐటీ శారీరక విద్య విభాగం అధిపతి డాక్టర్ బర్నబాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు కళాశాల యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి. బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. శారీరక దృఢత్వమే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని అన్నారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న 'ఫిట్ ఇండియా' లక్ష్య సాధనలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# హైదర్‌షాకోట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విచారణ కేంద్రం ఏర్పాటు




గండిపేట, క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అధికారులు ప్రత్యేక విచారణ కేంద్రంగా ప్రతిపాదించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అభ్యంతరాలు, వినతుల స్వీకరణ, విచారణల నిర్వహణ కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ సహాయ ఎన్నికల నమోదు అధికారి, సహాయ డిప్యూటీ కమిషనర్ సురేందర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలను ఇక్కడ అధికారుల సమక్షంలో పరిశీలిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు నమోదు, సవరణల అభ్యంతరాల పరిష్కారం కోసం ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని యంత్రాంగం తెలియజేసింది.





# బీరంగూడ శ్రీకృష్ణ నగర్‌లో అక్రమ అంతస్తులపై జిహెచ్ఎంసి కొరడా

## అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తుల కూల్చివేత

## అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

## అమీన్పూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల హెచ్చరిక

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఆగస్టు 29: అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ శ్రీకృష్ణ నగర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులకు మించి నిర్మించిన భవనాలపై అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. కాలనీలో భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన అధికారులు సంబంధిత భవనాలను పరిశీలించారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులను గుర్తించి కొలతలు చేపట్టి వివరాలను నమోదు చేశారు. అనంతరం అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలకు శ్రీకారం చుట్టారు. నిబంధనలను ఉల్లంఘించి భవనాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. భవన యజమానులు అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని ఇతర ప్రాంతాల్లోనూ అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# వనమహోత్సవం--2026లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉచిత మొక్కల పంపిణీ

## హైదరాబాద్ 5కే రన్ వేదిక వద్ద మొక్కలు అందుకున్న నగరవాసులు




హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్): వనమహోత్సవం--2026లో భాగంగా హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన హైదరాబాద్ 5కే రన్ కార్యక్రమం వేదిక వద్ద ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 5కే రన్‌లో పాల్గొన్నవారితో పాటు కార్యక్రమానికి హాజరైన సందర్శకులకు వివిధ రకాల మొక్కలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ నేపథ్యంలో హైదరాబాద్‌లో పచ్చదనాన్ని పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, నివాస సముదాయాలు, అందుబాటులో ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కల పెంపకం వల్ల వాయు నాణ్యత మెరుగుపడటంతో పాటు పట్టణ ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, ఆరోగ్యకరమైన పట్టణ వాతావరణాన్ని అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పచ్చదనాన్ని విస్తరించేందుకు హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో అర్బన్ పార్కుల అభివృద్ధి, అవెన్యూ--సెంట్రల్ మీడియన్ ప్లాంటేషన్లు, ల్యాండ్‌స్కేప్ అభివృద్ధి, నర్సరీల నిర్వహణ, ప్రజలకు ఉచిత మొక్కల పంపిణీ వంటి పలు హరిత కార్యక్రమాలను చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమం హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి, ఐఎఫ్ఎస్ పర్యవేక్షణలో, అసిస్టెంట్ డైరెక్టర్ (హార్టికల్చర్) శ్రీ దోనేపూడి చక్రపాణి సమన్వయంతో నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నిఖిల్ రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు సౌమ్య, నిఖిల్ కుమార్తో పాటు అర్బన్ ఫారెస్ట్రీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని బాధ్యతగా సంరక్షించడం ద్వారా హరిత హైదరాబాద్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# కేటీఆర్ పర్యటనకు కదిలిన గులాబీ దండు

## సెప్టెంబరు 3న మిర్యాలగూడకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతాం

## భారీగా తరలిరావాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యేల పిలుపు

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఆగస్టు 29:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనకు మిర్యాలగూడలో ఆ పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. సెప్టెంబరు 3న కేటీఆర్ మిర్యాలగూడకు రానున్న నేపథ్యంలో పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కార్యాచరణకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని రెడ్డి కాలనీ బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే కేటీఆర్ పర్యటన ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పంటలకు అవసరమైన సమయంలో నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రభుత్వ తీరును ప్రజల సమక్షంలో ఎండగట్టేందుకే కేటీఆర్



పర్యటన చేపడుతున్నారని పేర్కొన్నారు. భారీగా జనసమీకరణ: కేటీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులను సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సెప్టెంబరు 3న మిర్యాలగూడలో జరిగే కేటీఆర్ పర్యటనను ఐక్యంగా కదిలి విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో అల్లుబెల్లి అమరేందర్‌రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎండీ.



యూసుఫ్, డి. చిట్టిబాబునాయక్, బైరం సంపత్, అన్నబీమోజు నాగార్జునచారి, ఎండీ. ఇలియాస్‌ఖాన్, ఎండీ. మగ్దుంపాషా, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, మట్టపల్లి సైదులు యాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, డి. బాలాజీనాయక్, కుర్రా సేవ్యానాయక్, అంగోతు హతిరాంనాయక్, నిమ్మల నవీన్‌రెడ్డి, చౌగాని బిక్షంగౌడ్, అమరావతి సైదులు, ఖాజామొయినుద్దీన్, కొత్త మరెడ్డి, పేరాల కృపాకర్‌రావు, పెండ్యాల పద్మ, షహనాజ్‌బేగం, ధూళిపాళ కళావతి, కె. రమాదేవి, నంద్యాల శ్రీరాంరెడ్డి, బంటు శ్రీనివాస్, ఆయిల వెంకన్న, ధీరావత్ పాచునాయక్, ఎండీ. షోయబ్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



## డెంగీ, మలేరియా నివారణకు ముందస్తు చర్యలు

### మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

### మున్సిపల్ కమిషనర్ గణేష్

**వనపర్తి ఆగస్టు 29 క్రైమ్ మిర్రర్:** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా ముప్పు నుంచి ప్రజలను కాపాడేందుకు పెబ్బేరు మున్సిపాలిటీ ముందస్తు జాగ్రత్త చర్యలు ముమ్మరం చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో మోరీల పైన చేపడుతున్న ఫాగింగ్, మురుగు నీటి నిల్వల తొలగింపు మరియు పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బి ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. వర్షాల కారణంగా డ్రెయిన్లలో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, దీనివల్ల డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని కాలనీలలోనూ మోరీల పైన, నిల్వ నీటి ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ మరియు ఆంటీ-లార్వా స్ప్రేయింగ్ పనులు నిర్వహించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ గణేష్ మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల అరికట్టడానికి మున్సిపల్ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పూల కుండీలు, ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారంలో ఒక రోజు తప్పనిసరిగా 'డ్రై డే' పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. బి ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యోగేష్ కుమార్, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో తిప్పర్తి ఎస్ఐ రవి ఏకగ్రీవం

### నల్లగొండ సబ్ డివిజన్ డైరెక్టర్ గా ఎన్నిక

### శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



నల్గొండ జిల్లా క్రైమ్ మిర్రర్ : పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నల్గొండ సబ్ డివిజన్ ఎస్ఐ మరియు ఎఎస్ఐ విభాగం నుండి డైరెక్టర్‌గా తిప్పర్తి ఎస్ఐ ఇరుగు రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పీ శివరామ్ రెడ్డి డైరెక్టర్ గా గెలుపొందిన ఇరుగు రవికి నియామక పత్రం అందజేశారు. పోలీసుల సంక్షేమం కోసం పనిచేసే ఈ అసోసియేషన్ ఎన్నికలలో రవి ఎన్నిక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆయన ఎన్నికను పోలీసు అధికారులు మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, రవికి పలువురు అభినందనలు తెలిపారు.




## పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

### నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలి

### రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై క్యాబ్ డ్రైవర్లకు అవగాహన సదస్సు




**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో అలైవ్ అండ్ ఎరైవ్ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో క్యాబ్ డ్రైవర్లకు ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన క్యాబ్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ మాట్లాడటం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటి ఉల్లంఘనల వల్ల జరిగే ప్రమాదాల గురించి డ్రైవర్లకు సమగ్రంగా వివరించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రయాణికుల రక్షణతో పాటు తమ కుటుంబాల భద్రత కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు కూడా సురక్షిత డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించాలని క్యాబ్ డ్రైవర్లకు పిలుపునిచ్చారు.



## ఘనంగా నిర్మలా జ్యోతి పదవీ విరమణ కార్యక్రమం


### ఉత్తమ ఉపాధ్యాయురాలిగా విశిష్ట సేవలు అందించిన నిర్మలా జ్యోతి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నిర్మలా జ్యోతి పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీఎం గ్రాండ్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు అనిత మేడం అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. నిర్మలా జ్యోతి విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాలను జాతీయ స్థాయిలో ఎంపికయ్యేలా కృషి చేసినందుకు ఆమెను అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు ఎంఈఓ శంకర్ రాథోడ్ నిర్మలా జ్యోతిని ఘనంగా సన్మానించారు. ఆమె విద్యారంగంలో చేసిన సేవలను స్మరించుకుంటూ పలువురు ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పోచయ్య, అత్తాపూర్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రజియా బేగం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ చారి, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్‌తో పాటు యాదగిరి, మహేష్, బాలకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వసంతరాణి అంత్యక్రియలకు బీర్ల అయిలయ్య

### వసంతరాణి మృతికి బీర్ల అయిలయ్య సంతాపం

### వసంతరాణికి కన్నీటి నివాళి.. ప్రీతం కుటుంబానికి బీర్ల అయిలయ్య పరామర్శ



**క్రైమ్ మిర్రర్,గుండాల:-** మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన నాగరి ప్రీతం మాతృమూర్తి వసంతరాణి మృతిచెందడంతో తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం ఆమె అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రీతం, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వసంతరాణి మృతి కుటుంబానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇండ్లపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కీలక సమీక్ష

### అర్హులైన పేదలకు పారదర్శకంగా లబ్ధి చేకూర్చాలని అధికారులకు సూచన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కీలక సమీక్ష నిర్వహించారు. శనివారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక, మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్ల నిర్మాణం, పంపిణీ తదితర అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. అర్హత ఉన్న పేదలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, హౌసింగ్ పీడీ చెంబె నాయక్ తో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.....



# ప్యారాషూట్ నాయకులు" అనే విమర్శలు మానండి..

## ముందు మీ రాజకీయ చరిత్రను ప్రజల ముందు పెట్టండి

## బీఆర్ఎస్ నాయకులకు కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకుడు గాదె శివ సవాల్

**కూకట్‌పల్లి, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ని "ప్యారాషూట్ నాయకుడు" అంటూ విమర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ముందుగా ఆత్మవిమర్శ చేసుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి ఎక్కడ పుట్టాడు అనేది కాకుండా, ప్రజల కోసం ఏమి చేశాడు? ప్రజల సమస్యలపై ఎంతగా పోరాడాడు? ప్రజలకు ఎంత అందుబాటులో ఉన్నాడు? అనేదే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో ఒక వ్యక్తి తాను పుట్టిన నియోజకవర్గంలోనే రాజకీయంగా పోటీ చేయాలని ఎక్కడా లేదని గుర్తు చేశారు. ప్యారాషూట్ నాయకుడు అంటే ఎవరు?" అనే ప్రశ్నకు ముందుగా బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని గాదె శివ డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబ రాజకీయ ప్రయాణం, కేటీఆర్ రాజకీయ ప్రవేశం, అలాగే కూకట్‌పల్లి రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నామని చెప్పుకునే బీఆర్ఎస్ నాయకుల రాజకీయ నేపథ్యాలను కూడా ప్రజల ముందు చర్చకు తీసుకురావాలని అన్నారు. మీ నాయకుల రాజకీయ నేపథ్యాలను ఒకలా, ఇతర పార్టీల నాయకుల నేపథ్యాలను మరోలా చూడటం ఏ రాజకీయ న్యాయం?" అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ కేసీఆర్ కుటుంబ ప్రయాణం గురించి మాట్లాడండి. బీహార్ వాళ్ళు కదా ?? పారాషూట్ నాయకుడు అందామా? కేటీఆర్ విద్యాభ్యాసం ఎక్కడ జరిగింది, రాజకీయ ప్రవేశం ఎట్లా



జరిగింది. టీడీపీ సపోర్ట్ తో కాదా? పారాషూట్ నాయకుడు అందామా? కూకట్ రాజకీయం మొత్తం తన చేతిలో నడుపుతున్నానని చెప్పుకుంటున్న కోఆర్డినెటర్ సతీష్ అరోరా నేపథ్యం గురించి మాట్లాడండి. ఆంధ్రా కాదా? పారాషూట్ నాయకుడు అందామా?అని ప్రశ్నించారు. బండి రమేష్ ని "ప్యారాషూట్ నాయకుడు" అని విమర్శించే ముందు ఆయన కూకట్‌పల్లి ప్రజల కోసం చేసిన కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలు, అందుబాటులో ఉన్న తీరు గురించి మాట్లాడాలని సూచించారు.

**బహిరంగ చర్చకు సిద్ధమా?**

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ని బహిరంగ చర్చకు రావాలని బండి రమేష్ సవాల్ చేస్తున్న నేపథ్యంలో, ఆ సవాల్‌ను స్వీకరించి మీడియా మిత్రుల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని గాదె శివ కోరారు. గతంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి ఏం జరిగింది? ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చారు? ప్రజలకు ఏం చేశారు? ఇప్పటి వరకు ఏం జరిగింది? ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోంది? ప్రజలకు ఎవరు అండగా నిలుస్తున్నారు?" వంటి ప్రతి అంశంపై ఆధారాలతో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయం కాదని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజాసేవ కాదని అన్నారు. రాజకీయాలు మాట్లాడండి.. వాస్తవాలు మాట్లాడండి. ఆరోపణలు కాదు... ఆధారాలు కావాలి. మాటలు కాదు --- చేసిన పనుల లెక్క కావాలి. వ్యక్తిగత విమర్శలు కాదు --- ప్రజా సమస్యలపై చర్చ కావాలి." అని గాదె శివ స్పష్టం చేశారు. బహిరంగ చర్చకు వస్తే గత పాలనలో జరిగిన విషయాలు, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, కూకట్‌పల్లి అభివృద్ధి, ప్రజా సమస్యలపై పూర్తి ఆధారాలతో మాట్లాడుదామని ఆయన అన్నారు. ఎందుకు భయపడుతున్నారు? రండి.. మీడియా ముందు బహిరంగ చర్చ పెట్టండి. వాస్తవాలు ప్రజలే నిర్ణయిస్తారు." అని బీఆర్ఎస్ నాయకులకు గాదె శివ సవాల్ విసిరారు.



# క్రైమ్ పారామీటర్లలో అగ్రస్థానంలో నల్లగొండ జిల్లా పోలీస్

**నల్లగొండ క్రైమ్ మిర్రర్:** నల్లగొండ: రాష్ట్రస్థాయిలో క్రైమ్ పారామీటర్ల అమలు, పోలీస్ శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో నల్లగొండ జిల్లా పోలీస్ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరును సమీక్షించిన అధికారులు 8 కీలక అంశాల్లో సమగ్ర పనితీరు ఆధారంగా నల్లగొండ జిల్లాను క్లస్టర్-3లో అగ్రస్థానంలో నిలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కు డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, అంకితభావంతో ఉత్తమ ఫలితాలు సాధించారని డీజీపీ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీజీపీ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీస్ శాఖ సాధించిన విజయంపై ఎస్పీ శరత్ చంద్ర పవార్ హర్షం వ్యక్తం చేస్తూ కృషి చేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# చంపుతానంటూ బెదిరింపులు.. డబ్బులు వసూలు

### పరారీలో ఉన్న రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసిన శంకర్‌పల్లి పోలీసులు



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసిన కేసులో పరారీలో ఉన్న రౌడీషీటర్‌ను శంకర్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహాలింగాపురం గ్రామానికి చెందిన భార్యాభర్తల మధ్య సుమారు రెండేళ్ల క్రితం కుటుంబ వివాదం తలెత్తింది. ఈ విషయంలో పెద్దమనిషిగా వ్యవహరించిన రౌడీషీటర్ మహమ్మద్ మునీర్ పాషా ఖురేషి పంచాయతీ మాట్లాడేందుకు పలు దఫాలుగా బాధితుల నుంచి రూ.50 వేల వరకు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం ఇతరులకు చెబితే చంపేస్తానంటూ బాధితులను బెదిరించినట్లు పేర్కొన్నారు. దీనిపై బాధితులు శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఖురేషిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే గత కొన్ని రోజులుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న ఖురేషిని పోలీసులు శనివారం శంకర్‌పల్లిలో రెక్కీ నిర్వహించి అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు శంకర్‌పల్లి పోలీసులు వెల్లడించారు.ఖురేషి వల్ల ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా ముందుకు వచ్చి శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### 33 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం వద్దు: ఎర్రోళ్ల శాంతి కుమార్




**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, క్రైమ్ మిర్రర్:-** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల శాంతి కుమార్ డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 33 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు.బకాయిలు విడుదల కాకపోవడంతో ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చదువులు పూర్తయిన విద్యార్థులకు బోనఫైడ్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు పొందడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్న పేద తల్లిదండ్రులపై ఫీజుల భారం పడుతోందన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థుల విద్యా భవిష్యత్తును కాపాడాలని శాంతి కుమార్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు లింగస్వామి, ప్రధాన కార్యదర్శి వెలువర్తి శ్రీకాంత్, కార్యదర్శులు ఏర్పుల సురేష్, కొమ్ము సాయి కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి నగేష్, సాగర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రైమ్ కంట్రోల్‌లో నల్లగొండ పోలీసుల దూకుడు

### ఎస్పీ శరత్ చంద్ర పవార్ నాయకత్వానికి రాష్ట్రస్థాయి గుర్తింపు

### 8 కీలక అంశాల్లో ఉత్తమ పనితీరు.. క్లస్టర్-3లో నల్లగొండకు అగ్రస్థానం

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నేర నియంత్రణలో నల్లగొండ జిల్లా పోలీసులు సత్తా చాటారు. క్రైమ్ పారామీటర్ల అమలు, పోలీస్ శాఖ పనితీరుపై రాష్ట్ర స్థాయిలో, నిర్వహించిన సమగ్ర సమీక్షలో నల్లగొండ జిల్లా అద్భుతమైన ఫలితాలు సాధించింది. ఎనిమిది కీలక అంశాల్లో సమగ్ర పనితీరు కనబరిచి క్లస్టర్-3లో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. జిల్లా పోలీస్ శాఖ సాధించిన ఈ ఘనతకు, రాష్ట్ర పోలీస్ బాస్ నుంచి ప్రశంసలు లభించడం విశేషం. జిల్లా పోలీస్ శాఖను సమర్థవంతంగా నడిపిస్తూ, నేర నియంత్రణతో పాటు కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, పోలీస్ స్టేషన్ ల పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై, ప్రత్యేక దృష్టి సారిస్తున్న జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ నాయకత్వానికి ఈ విజయం అద్దం పడుతోంది. విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇస్తూ, పోలీస్ యంత్రాంగాన్ని నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఎస్పీ జిల్లాలో పోలీసింగ్ ప్రమాణాలను పవార్ మరింత మెరుగుపరిచారు.

**ప్రతి స్థాయిలో పర్యవేక్షణ.. ఫలితాల్లో ప్రతిఫలనం**

జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఎస్పీ శరత్ చంద్ర పవార్.. పోలీస్ స్టేషన్ ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన దిశానిర్దేశాలు చేస్తున్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తులో నాణ్యత పెంచడం, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడం, నేరస్తులపై చట్టపరమైన చర్యలను వేగవంతం చేయడం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వర స్పందన, వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగాన్ని పెంచడంతో పాటు, నేరాలపై ముందస్తు నిఘా, నేరస్తుల కదలికలపై పర్యవేక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారులు, సిబ్బందితో నిరంతరం సమన్వయం చేస్తూ విధుల్లో, మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ సమిష్టి కార్యాచరణే రాష్ట్రస్థాయి సమీక్షలో నల్లగొండ పోలీసులకు అగ్రస్థానాన్ని తీసుకొచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు.

**ఎస్పీ పవార్ కి తెలంగాణ డీజీపీ ప్రశంసాపత్రం**

రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరును పరిశీలించిన అధికారులు.. ఎనిమిది కీలక అంశాల్లో



నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ సమగ్ర పనితీరును గుర్తించారు. క్లస్టర్-3లో నల్లగొండ జిల్లాను అగ్రస్థానంలో నిలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్ నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, అంకిత భావంతోనే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత సమర్థవంతంగా, విధులు నిర్వహిస్తూ అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు.

**ఈ విజయం ప్రతి పోలీస్ ఉద్యోగిదే".. ఎస్పీ పవార్**

రాష్ట్రస్థాయిలో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు అగ్రస్థానం దక్కడంపై, ఎస్పీ శరత్ చంద్ర పవార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనతకు కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాల బృందాలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..రాష్ట్రస్థాయిలో నల్లగొండ పోలీసులకు లభించిన గుర్తింపు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది నిబద్ధతకు నిదర్శనమన్నారు. పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను సమర్థవంతంగా, నిర్వర్తించినప్పుడే ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో పనిచేసి నేర నియంత్రణలో మరింత ముందుకు సాగాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు భద్రత కల్పించడం, బాధితులకు సత్వర న్యాయం అందించడం, నేరాలను అరికట్టడం, శాంతి భద్రతలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పవార్ స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయిలో సాధించిన ఈ అగ్రస్థానం అంతిమ విజయం కాదని, మరింత మెరుగైన పనితీరుకు ఇది ప్రేరణగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ నాయకత్వంలో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ సాధించిన ఈ విజయం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. నేర నియంత్రణ నుంచి కేసుల దర్యాప్తు వరకు ప్రతి అంశంలో మెరుగైన పనితీరును కనబరుస్తూ క్లస్టర్-3లో అగ్రస్థానంలో నిలవడం, జిల్లా పోలీసుల పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. డీజీపీ చేతుల మీదుగా ఎస్పీకి ప్రశంసాపత్రం అందడం జిల్లా పోలీస్ శాఖకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.

# భవిష్యత్ పోరాటాలపై బిజెపి కసరత్తు

**22ఎ భూములపై త్వరలోనే కార్యాచరణ**

**పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రామ్ సమీక్ష**

హైదరాబాద్: తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22-ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22-ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.



# తమ్మర గ్రామ పంచాయతీలో ఓటరు దరఖాస్తుల సవరణ కార్యక్రమం

**కోదాడ ఆగస్టు 29 క్రైమ్ మిర్రర్ :** మున్సిపల్ పరిధిలోని తమ్మర 3వ వార్డులో ఓటరు జాబితా, ఓటరు దరఖాస్తులకు సంబంధించిన సవరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గతంలో ఓటు నమోదు ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకున్న కొంతమంది ఓటర్లకు అవసరమైన ప్రూఫ్‌లు, ధ్రువపత్రాలు సక్రమంగా లేకపోవడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు.ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు సంబంధించిన ఆధారాలు, వివరాలతో 3వ వార్డులోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరై తమ ఓటరు దరఖాస్తులను సరిచేసుకున్నారు.అధికారులు దరఖాస్తులను పరిశీలించి, అవసరమైన పత్రాలను స్వీకరించి వివరాలను సవరించారు.3వ వార్డు కౌన్సిలర్ వంగూరీ గోపి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్. శైలజ హాజరై ఓటర్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సక్రమంగా నమోదయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ సామినేని నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కనగాల రాధాకృష్ణ, ఎలక్షన్స్ సూపర్వైజర్ పి, అరవింద్, బీఎల్ఓ సూపర్వైజర్ ఎన్. సైదులు, బీఎల్ఓలు కుక్కల వెంకటరమణ, ఎస్కే. జాన్‌బీ, లాల్‌బీ, రామ, , మరియు తమ్మర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### కలిసి ఎదుగుదాం కలిసి సాధిద్దాం కార్యక్రమం పై అవగాహన కల్పించిన.. మాజీ డిజిపి మహేందర్ రెడ్డి,



**క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల సర్వేల్ గురుకుల పాఠశాలలో క్రమశిక్షణ, పరిశుభ్రత, అనవసర వస్తువులను తొలగింపు, పూర్వ విద్యార్థుల కనెక్ట్, కలిసి ఎదుగుదాం - కలిసి సాధిద్దాం కార్యక్రమం లో పాల్గొని మాట్లాడుతూ తాను చదువుకున్న సర్వేల్ గురుకుల పాఠశాలను దత్తత తీసుకుంటున్నటు పూర్వ విద్యార్థి తెలంగాణ మాజీ డిజిపి మహేందర్ రెడ్డి, తనతోపాటు గురుకుల ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉషారాణి స్థానిక డిఎస్పి, సిఐ,ఎస్ఐ లను భాగస్వాములు గా చేర్చారు అనంతరం కలిసి ఎదుగుదాం - కలిసి సాధిద్దాం కార్యక్రమం పై అవగాహన కల్పించిన తెలంగాణ మాజీ డిజిపి మహేందర్ రెడ్డి, ఈ కార్యక్రమం లో గురుకుల ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉషారాణి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.